ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 144, పేజీలు - 08

గురువారం, నవంబర్ 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

కస్టోడియన్ భూములపై కబ్జా కోరలు



- 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు, అనుమతులు, రిజిస్ట్రేషన్లెలా.?
- ఉప్పల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాల బాగోతమా.?
- కేంద్ర ప్రభుత్వ భూములపై ప్రైవేటు కబ్జాల పెత్తనం
- సర్వే నంబర్లు 644, 645లో సుమారు 4 ఎకరాల 7 గుంటల భూమి
- నిషేధిత జాబితాలో ఉన్న భూములకు నకిలీ పత్రాలతో అనుమతులా.?
- సామాజిక కార్యకర్త బాబా గౌడ్ సంచలన ఆరోపణలు
- జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి
- అక్రమ భూములను స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్



Sl. No.	Name of the District	Name of the Mandal	Name of the Village / Town	Sy.No & Sub-Division No. (if any)	Town Sy.No. (If applicable)	House No. (If applicable)	Extent	State Govt / Central Govt
1	2	3	4	5	6	7	8	9
62	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	641	-	-	9-10	Central Government. (Survey of India)
63	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	642/1	-	-	2-27	Central Government. (Survey of India)
64	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	642/2	-	-	0-03	State Government . (Inner Ring Road)
65	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	642/3	-	-	2-00	Central Government. (Survey of India)
66	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	643	-	-	4-21	Central Government. (Survey of India)
67	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	644	-	-	3-03	State Government. (Custodian)
68	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	645	-	-	1-04	State Government. (Custodian)
69	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	648/2	-	-	3-16	State Government . (Inner Ring Road)
70	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	649/2	-	-	0-01	State Government . (Inner Ring Road)
71	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	680	-	-	4-27	State Government. (Social Welfare Houses)
72	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/1	-	-	3-18	Central Government. (Survey of India)
73	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/2	-	-	0-03	State Government . (Inner Ring Road)
74	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/2	-	-	0-24	State Government. (Khaburasthan)
75	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/3	-	-	0-35	State Government. (Khaburasthan)
76	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/4	-	-	0-08	State Government. (Khaburasthan)
77	Medchal-Malkajgiri	Uppal	Uppal Khalsa	727/5	-	-	0-07	State Government. (Khaburasthan)

Tahsildar, Uppal Mandal | Revenue Divisional Officer Keesara Division | Additional Collector Medchal Malkajgiri District | District Collector Medchal Malkajgiri District

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో ప్రభుత్వ భూముల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందా.? ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారా.? దేశ విభజన అనంతరం ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్న కస్టోడియన్ భూములపైనా అక్రమార్కుల కన్ను పడిందా.? చట్టాలు, నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి కోట్లాది రూపాయల విలువైన భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి చేర్చుతున్నారని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ ఆరోపించారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కీసర డివిజన్, ఉప్పల్ మండల పరిధిలోని సర్వే నంబర్లు 644, 645లో ఉన్న సుమారు నాలుగు ఎకరాల ఏడు గుంటల కస్టోడియన్ భూముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు ప్రభుత్వ అధీనంలో ఉన్న ఈ భూములు నేడు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లి బహుళ అంతస్తుల నిర్మాణాలకు వేదికగా మారడం వెనుక అసలు కథ ఏమిటన్న ప్రశ్నలు స్థానికులలో వెల్లువెత్తుతున్నాయి.

22-ఏ జాబితాలో ఉంటే నిర్మాణం, రిజిస్ట్రేషన్ ఎలా.?

నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి.? కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కస్టోడియన్ భూములపై హక్కులు ఎలా కల్పించారు.? ఉప్పల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ పత్రాల ఆధారంగా ఈ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయి.? నిషేధిత జాబితాలో ఉన్న భూములపై రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎవరు అనుమతించారు.? అనే అనేక ప్రశ్నలు ఇప్పుడు అధికారుల ముందున్నాయి.నకిలీ పత్రాలు సమర్పించి అనుమతులు పొందారంటూ సామాజికవేత్త బాబా గౌడ్ ఆరోపించడం ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రతరం చేసింది. అసలు పత్రాలు ఏమిటి.? వాటిని పరిశీలించిన అధికారులు ఎవరు.? భూమి హక్కుల మార్పిడికి సంబంధించిన దస్త్రాలు ఎక్కడ ఉన్నాయి.? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వ ఆస్తికి రాష్ట్ర అధికారుల అనుమతులా.?

దేశ విభజన సమయంలో వదిలివెళ్లిన ఆస్తుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కస్టోడియన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కస్టోడియన్ భూముల నిర్వహణ, పరిరక్షణకు సంబంధించి కేంద్ర చట్టాలు స్పష్టమైన నిబంధనలు నిర్దేశించాయి. 1950 నాటి వదిలివెళ్లిన ఆస్తుల నిర్వహణ చట్టం, 1968 నాటి శత్రు ఆస్తుల చట్టం వంటి చట్టాల ప్రకారం సంబంధిత ఆస్తులపై హక్కులు, బదిలీలు, విక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో వర్తించే నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.
అయితే ఉప్పల్ మండలంలోని ఈ భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా.? లేక రికార్డుల మార్పులు, నకిలీ పత్రాల ఆధారంగా భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయా.? దీని వెనుక ఉన్న పెద్దలు ఎవరు.? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

ఫిర్యాదులపై అధికారుల మౌనం ఎందుకు.?

కస్టోడియన్ భూముల అక్రమాలపై గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు మౌనం వహిస్తే, అక్రమార్కులకు మరింత ధైర్యం చేకూరినట్లే.భూముల రికార్డులు, పాత పట్టాలు, రిజిస్ట్రేషన్ దస్త్రాలు, అనుమతి పత్రాలు, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలిస్తే ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అవసరమైతే సంబంధిత రిజిస్ట్రేషన్ అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి. భూములను స్వాధీనం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్లు 644, 645లోని భూములపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ బదిలీలు జరిగినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ వాసులు కోరుతున్నారు. అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిన భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవాలని, నకిలీ పత్రాలు సమర్పించిన వారితో పాటు వాటిని పరిశీలించకుండా అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆస్తులకే రక్షణ లేకపోతే సామాన్యుల భూములకు భరోసా ఎక్కడ.?

కస్టోడియన్ భూముల పేరుతో జరుగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా కదులుతుందా.? ఉప్పల్ ఎమ్మార్వో, రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై నిజాలు వెలుగులోకి వస్తాయా.? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి భూములను స్వాధీనం చేసుకుంటారా.? లేక ఫిర్యాదులు ఫైళ్లకే పరిమితమవుతాయా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై జిల్లా కలెక్టర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

పౌల్ట్రీ పరిశ్రమకు ప్రభుత్వం అండ

- అనుమతుల జాప్యానికి చెక్.. త్వరలోనే సింగిల్ విండో పాలసీ
- ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ పరిశ్రమకు ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్
- మొక్కజొన్న, సోయాబీన్ ఫీడ్ విషయంలో ప్రభుత్వ సహకారం
- బఫర్ స్టాక్‌పై 48 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరికి సీఎం ఆదేశం
- రైతుల ఆర్థిక బలోపేతంలో పౌల్ట్రీ రంగం కీలకమన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రజాప్రశ్న) పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా త్వరలోనే సమగ్ర పాలసీ రూపొందించి సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫామ్స్ ఏర్పాటుకు అనుమతులు, భూముల కన్వర్షన్ వంటి అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగిస్తామని తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో

2లో..

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

- రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో భారీ ఉపశమనం లభించింది. రాహుల్కు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీలను ఆదేశిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును అత్యున్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ అలహాబాద్ హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను పునఃపరిశీలన కోసం హైకోర్టుకు తిరిగి పంపింది. ఈ పిటిషన్ విచారణకు అర్హమైనదా కాదా అనే అంశంతో సహా అన్ని విషయాలను మళ్లీ పరిశీలించాలని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు గతంలోనే అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. అలాగే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి నివేదికలను దాఖలు చేయవద్దని సీబీఐ, ఈడీలకు కూడా గతంలోనే స్పష్టం చేసింది.సీబీఐ, ఈడీలకు ఆదేశాలు జారీ చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాహుల్ గాంధీ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

2లో..

ప్రజలపై పన్నుల భారం ఉండకూడదు

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజలపై అదనపు పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వ శాఖల ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆదాయార్జన శాఖలపై బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.గడచిన రెండున్నరేళ్లుగా ప్రభుత్వ నిర్ణయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, వివిధ ప్రభుత్వ శాఖల్లోని వ్యవస్థలు గాడిలో పడ్డాయని సీఎం అన్నారు.ఆదాయ లీకేజీలను తగ్గించడం, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడంలో పలు శాఖలు మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు.

2లో..

యువతను మత్తు నుంచి బయటపడేద్దాం

- 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర ప్రారంభం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రధాని మోదీ పిలుపునకు అనుగుణంగా హైదరాబాద్‌లో నషా ముక్త్ భారత్ పాదయాత్ర చేపట్టారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర చే నెంబర్ చౌరస్తా, ఓయూ ఎంట్రన్స్ గేట్, ఆర్ట్స్ కాలేజ్, సీతాఫల్ మండి చౌరస్తా, చిలకలగూడ క్రాస్ రోడ్ మీదుగా ముషీరాబాద్ చౌరస్తా వరకు చేరుకుంది. మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు, సినీహీరో వెంకటేష్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నషా ముక్త్ భారత్ పాదయాత్రలో పాల్గొన్నారు. కొన్ని విచ్ఛిన్నకర శక్తులు డ్రగ్స్ ఇచ్చి యువతను తప్పుదారి పట్టిస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. నషా ముక్త్ భారత్‌లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. తనతో పాటు విద్యార్థులు, యువత పాదయాత్రలో భాగస్వామ్యం కావాలని కిషన్ రెడ్డి కోరారు. విక్టరీ వెంకటేశ్ రాకతో

2లో..

10 లక్షల నమోదుతో మై టీడీపీ యాప్ రికార్డ్

- మై ఫ్యామిలీ అంటూ నారా లోకేష్ హర్షం



అమరావతి (ప్రశ్న న్యూస్) కార్యకర్తే అధినేత అని, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం, బలగమని ఏపీ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీకి, కార్యకర్తకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన 'మైటీడీపీ' యాప్‌లో నమోదైన కుటుంబ సభ్యుల సంఖ్య 10 లక్షలకు చేరుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ మైలురాయిని చేరుకోవడంపై టీడీపీ అధికారిక ప్రకటన విడుదల చేయగా, లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ పార్టీ శ్రేణులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్త పడే ప్రతి కష్టానికీ గుర్తింపు లభించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త అభిప్రాయానికీ విలువ ఉండాలని, పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికి సముచిత అవకాశాలు దక్కాలనే లక్ష్యంతోనే 'మైటీడీపీ' యాప్‌కు శ్రీకారం చుట్టామని ఆయన వివరించారు. ఈ ప్రయాణంలో భాగస్వాములైన 10 లక్షల మంది తెలుగుదేశం కుటుంబ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల డిజిటల్ నిర్వహణలో మైటీడీపీ యాప్ ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిందని టీడీపీ తన ప్రకటనలో వెల్లడించింది.

2లో..

పౌల్ట్రీ పరిశ్రమకు ప్రభుత్వం అండ

ఇండియన్ పౌల్ట్రీ ఈక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో--2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో వివిధ సంస్థలు తమ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్

గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ పరిశ్రమ స్థాపనకు అనుమతులు పొందడం, భూముల మార్పిడి వంటి ప్రక్రియలకు ఎక్కువ సమయం పడుతోందని పరిశ్రమ ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారని సీఎం తెలిపారు. పట్టణాల్లో బిల్డ్‌నౌ యాప్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్న తరహాలోనే గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. త్వరలో సమగ్ర పాలసీని తీసుకొచ్చి అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తామన్నారు.డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026లో పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు తమ ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పరిశ్రమకు అవసరమైన ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తగిన భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులుండవు

ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితుల నేపథ్యంలో పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన దాణా కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. పౌల్ట్రీ రంగం అన్ని సమయాల్లో ఒకే విధంగా లాభదాయకంగా ఉండకపోవచ్చని, కొన్ని సందర్భాల్లో సంక్షోభాలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి సమయాల్లో మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా పంటల సరఫరాలో ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాల నిల్వలు తగినంతగా ఉన్నాయని, పౌరసరఫరాల శాఖ వద్ద బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని సీఎం వెల్లడించారు. మొక్కజొన్న, సోయాబీన్ వ్యాపారుల నుంచి బహిరంగ మార్కెట్‌లో విక్రయించకుండా పౌల్ట్రీ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తామన్నారు.

48 గంటల్లో నిర్ణయం తీసుకోవాలి

ప్రభుత్వం వద్ద ఉన్న బఫర్ స్టాక్ ఎంత? పౌల్ట్రీ పరిశ్రమకు ఏ విధంగా సహకరించవచ్చు? ఏ ధరకు సరఫరా చేయవచ్చు? అనే అంశాలపై వ్యవసాయ శాఖ మంత్రితో కలిసి సమీక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు వేదికపైనే ఉన్న మంత్రి వాకిటి శ్రీహరికి 48 గంటల్లో మంచి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన దాణా విషయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తించి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

రైతుల ఆర్థిక బలోపేతంలో కీలక పాత్ర

పౌల్ట్రీ పరిశ్రమ రైతులు, రైతు కూలీల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. రైతులు పండించే మొక్కజొన్న, సోయాబీన్‌తో పాటు నూకలు, తౌడు వంటి వ్యవసాయ ఉప ఉత్పత్తులను పౌల్ట్రీ పరిశ్రమ కొనుగోలు చేస్తోందని గుర్తుచేశారు. తద్వారా వ్యవసాయ రంగానికి కూడా అండగా నిలుస్తోందన్నారు. గుడ్లు, చికెన్ ఉత్పత్తి ద్వారా రైతులకు ఆదాయ మార్గాలను కల్పించడంతో పాటు యువతకు అవసరమైన ప్రొటీన్‌ను అందిస్తున్న పరిశ్రమగా పౌల్ట్రీ రంగాన్ని అభివర్ణించారు. తెలంగాణలో ప్రతిరోజూ సుమారు 5.30 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు గుడ్లు, నాణ్యమైన చికెన్‌తో కూడిన భోజనాన్ని అందించేందుకు పౌల్ట్రీ పరిశ్రమ సహకారం ఉపయోగపడుతోందని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఈ రంగం భాగస్వామ్యం ప్రశంసనీయమన్నారు. హైదరాబాద్‌లో 18 ఏళ్లుగా పౌల్ట్రీ, మీట్ ఎక్స్‌పో నిర్వహించడం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే దేశంలో అత్యధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడం పట్ల పరిశ్రమ ప్రతినిధులను అభినందించారు.

పౌల్ట్రీకి ప్రాధాన్యత రంగ హోదా

ఐటీ, ఫార్మా, డిఫెన్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లతో పాటు పౌల్ట్రీ పరిశ్రమను కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత రంగంగా గుర్తించిందని సీఎం తెలిపారు. పౌల్ట్రీ రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.తెలంగాణలో పాలసీ పెరాలసిస్‌కు తావులేదని, గత మూడు దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు అమలు చేసిన మంచి విధానాలను కొనసాగిస్తూనే మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా పారిశ్రామిక విధానాలు మారుతున్నాయని, దీంతో పెట్టుబడిదారుల్లో అనిశ్చితి నెలకొంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం పెట్టుబడులకు భద్రత, పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచడమే లక్ష్యం

దేశ జనాభాలో కేవలం 2.5 శాతం వాటా కలిగిన తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో 5 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ వాటాను 10 శాతానికి పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ లక్ష్యాల సాధనలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పౌల్ట్రీ రంగం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై పరిశ్రమ ప్రతినిధులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు రక్షణ కల్పిస్తూ పౌల్ట్రీ పరిశ్రమను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

యువతను మత్తు నుంచి బయటపడేద్దాం

డ్రగ్స్‌పై చేస్తున్న ఉద్యమం విక్టరీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని శత్రుదేశాల కుట్ర పన్నుతున్నాయని ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. యువ వనరులను డ్రగ్స్ పేరుతో దొంగ దెబ్బ తీస్తున్నారని, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని ప్రధాని సంకల్పించారన్న లక్ష్మణ్ ప్రధాని సంకల్పంలో ప్రతి ఒక్కరం కంకణబద్ధులం కావాలని పిలుపునిచ్చారు.పిల్లలను విద్యాలయాలకు పంపే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలనీ పిల్లల కదలికలను గమనించాలనీ కోరుతున్నారు ఎంపీ లక్ష్మణ్. యువత డ్రగ్స్ జోలికి వెళ్లొద్దనీ, వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకూ ఉందని అన్నారాయన. ప్రతీ పేరెంట్ తమ పిల్లలతో ఓపెన్‌గా మాట్లాడి డ్రగ్స్‌కి బానిస కాకుండా చూడాలని వెంకటేష్ సూచించారు. డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దంటూ యువతను కోరారు వెంకటేష్. అంబర్‌పేట నుంచి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాదయాత్రను నటుడు వెంకటేశ్ జెండా ఊపి ప్రారంభించారు. మూడురోజుల పాదయాత్రలో నేడు అంబర్‌పేట నుంచి ముషీరాబాద్ వరకు ఈ యాత్ర కొనసాగనుంది. విద్యార్థులు, యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా భారీ ఎత్తున హైదరాబాద్ వాక్ ఫర్ నషాముక్త్ భారత్ పేరిట పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఎంతో మంది పెద్ద నాయకులు ప్రసంగించిన ఆర్ట్స్ కాలేజీ గడ్డ మీద నుంచి మాట్లాడటం ఆనందంగా ఉందని నటుడు నిఖిల్ చెప్పారు. నషాముక్త్ భారత్‌లో పాల్గొన్నారు. యువత అప్రమత్తంగా ఉండాలన్న ఆయన డ్రగ్స్ ఒక్కటే కాదు సిగరెట్ వంటివి కూడా వద్దని సూచించారు. నటి పాయల్ రాజ్‌పుత్ సైతం నషాముక్త్ భారత్ పాదయాత్రలో పాల్గొన్నారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కోసం అందరం కృషి చేయాలన్నారు.హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ పాదయాత్ర రెండో రోజు ఆర్టీసీ క్రాస్ రోడ్, అశోక్ నగర్ చౌరస్తా, హిమాయత్ నగర్ చౌరస్తా, లిబర్టీ, అంబేద్కర్ విగ్రహం, ఖైరతాబాద్ చౌరస్తా, పంజాగుట్ట జంక్షన్ మీదుగా సత్యం థియేటర్ దగ్గరకు చేరుకుంటుంది. మూడో రోజు యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్, ఇందిరానగర్ చౌరస్తా, బసవతారకం హాస్పిటల్, జగన్నాథస్వామి ఆలయం, ఫిల్మ్ నగర్ మీదుగా జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ వరకు పాదయాత్ర సాగుతుంది. అక్కడ భారీ ముగింపు సభ ఉంటుంది.

10 లక్షల నమోదుతో మై టీడీపీ యాప్ రికార్డ్

నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన ఈ వేదిక ద్వారా సాధారణ కార్యకర్తలను గుర్తించి, వారి సేవలకు తగిన అవకాశాలు కల్పిస్తున్నట్లు పార్టీ తెలిపింది. గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలు చేపట్టే కార్యకర్తలు తమ వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేసుకునే సదుపాయం ఉంది.

యాప్‌లో నమోదయ్యే సమాచారం ఆధారంగా కార్యకర్తల పనితీరును నేరుగా పరిశీలించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు, పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు టీడీపీ స్పష్టం చేసింది. ఈ సాంకేతిక వేదిక ద్వారా పార్టీ అధినేత సందేశాలు, కీలక మార్గదర్శకాలు శ్రేణులకు వేగంగా చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయి సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలను నేరుగా పార్టీ అగ్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ యాప్ ఒక సమర్థవంతమైన సాధనంగా పనిచేస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్ తమ మునుపటి ఉత్తర్వులకు అనుగుణంగా లేదని, పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై జరిగిన పురోగతిని సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్ సరైన రీతిలో వివరించలేదని హైకోర్టు గతంలో పేర్కొంది. ఈ వ్యవహారంలో జరిగిన దర్యాప్తు పురోగతిని వివరిస్తూ కొత్త అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందని ఆరోపిస్తూ సదరు బీజేపీ నేత గతంలో మరికొన్ని పిటిషన్లను కూడా దాఖలు చేశారు.రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారంటూ ఎస్ విఘ్నేశ్ శిశిర్ గతంలో ఆరోపించారు. ఈ విషయంలో రాహుల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపైనా దర్యాప్తు జరపాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టును కోరారు. అయితే, ఈ పిటిషన్‌ను పరిశీలించిన అలహాబాద్ హైకోర్టు మే నెలలో సీబీఐ, ఈడీకి ఈ ఆరోపణలను పరిశీలించి, ధ్రువీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు పురోగతిని తమకు తెలియజేయాలని పేర్కొంది. అనంతరం, జులై 20న ఈ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు, అప్పట్లో సీబీఐ సమర్పించిన అఫిడవిట్పై అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తు ప్రస్తుత స్థితిని వివరించేలా కొత్త అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ప్రజలపై పన్నుల భారం ఉండకూడదు

రెండున్నరేళ్ల కూటమి పాలనలో పారదర్శకత, ఆన్‌లైన్ సేవలు, శాఖాపరమైన సంస్కరణలతో ఆదాయం పెరుగుతోందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ఆదాయంలోనూ ప్రతిఫలించాలని సీఎం చెప్పారు. ప్రతీ వారం ఆదాయ ఆర్జనలపై దృష్టి సారిస్తూ ఆ మేరకు నివేదికలు సిద్ధం చేసుకోవాలని అవసరమైన మేరకు మార్పులు చేర్పులు చేసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

ప్రభుత్వ శాఖలన్నీ ఏఐ స్టాక్ ద్వారా ఆదాయాలను మెరుగు పర్చుకోవాలి

ప్రభుత్వ శాఖలన్నీ ప్రత్యేక ఏఐ స్టాక్ ద్వారా ఆదాయాలను మెరుగు పర్చుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సమన్వయంతో డేటా లేక్ ద్వారా సమాచారాన్ని విశ్లేషించి ఎక్కడా రెవెన్యూ లీకేజీలు లేకుండా చూడాలని అన్నారు. 2027 మార్చి నాటికి వంద శాతం వ్యవస్థల్లో మెరుగుదల చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, పురపాలక, పంచాయితీరాజ్, అటవీశాఖల లాంటి ఆదాయార్జన శాఖలు సాంకేతికతను అమలు చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు వివిధ శాఖల్లో నమోదైన వృద్ధిని నమోదు చేయాలన్నారు. భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించారు. మద్యం తయారీ నుంచి విక్రయం వరకూ ట్రాకింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాహనాల లోడ్, ఇ-వేబిల్స్ సహా వివిధ అంశాలపై రవాణా శాఖ ఎలక్ట్రానిక్ విధానంలో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

వార్షిక లక్ష్యంలో ఇప్పటికే సమకూరిన 58 శాతం ఆదాయం

2026-27 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 23 నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరిందని అధికారులు సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.62,604 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.11,738 కోట్లు పెరిగి 18.7 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. రూ.1,27,506 కోట్ల వార్షిక లక్ష్యంలో నవంబర్ 23 నాటికి 58 శాతం సాధించినట్లు వెల్లడించారు. సమీక్షలో వివిధ శాఖల ఆదాయాలపై అధికారులు వివరిస్తూ పన్ను ఆదాయం గత ఏడాది ఇదే కాలంలో రూ.53,692 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.63,796 కోట్లకు చేరిందని, పన్నుల ద్వారా రూ.10,104 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని, పన్ను ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. వాణిజ్య పన్నుల ఆదాయం 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్లు పెరిగి రూ.38,241 కోట్లకు చేరిందని అధికారులు తెలిపారు. ఇందులో జీఎస్టీ ఆదాయం 18.1 శాతం వృద్ధితో రూ.3,694 కోట్లు పెరిగి రూ.24,073 కోట్లకు చేరిందని వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.20,083 కోట్లకు చేరిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.3,287 కోట్లు అదనంగా రావడంతో 19.6 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం 16.6 శాతం పెరిగి రూ.8,020 కోట్లకు, వాహన పన్నుల ఆదాయం 17.3 శాతం పెరిగి రూ.3,649 కోట్లకు చేరిందని అధికారులు స్పష్టం చేశారు. గనులు, భూగర్భ శాఖ ఆదాయం 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు, అటవీ శాఖ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.22 కోట్లకు చేరిందని అన్నారు. పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు పెరిగిందని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ

ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీలకు సుమారు రూ.239 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని, ఇదే కాలంలో పట్టణ స్థానిక సంస్థలకు సుమారు రూ.2,366 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని అధికారులు సమీక్షలో వివరించారు. ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపర్చేందుకు 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయ వ్యవహారాల్లో ఏఐని వినియోగిస్తున్నట్లు వివరించారు. పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో గత ఏడాది రూ.1,015 కోట్ల పన్నుల్ని డిజిటల్ గానే వసూలు చేసినట్లు అధికారులు తెలియచేశారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

- వేలాది మందికి జీవనోపాధి అన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ట్రక్ పార్క్ భూములను వేలం వేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని మండిపడ్డారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన ప్రభుత్వ భూములను వేలం వేస్తూ ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వం తాకట్టు పెడుతోందని విమర్శించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ అఖిలపక్ష నాయకులు చేపట్టిన నిరసన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజల జీవనోపాధికి ఆధారంగా ఉన్న ట్రక్ పార్క్ భూముల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేసి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

విద్యారంగంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దు

- ప్రభుత్వానికి కవిత సూచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇంటర్మీడియట్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, జూనియర్ కాలేజీలు, పాఠశాల యాజమాన్యాలు, విద్యావేత్తలతో సమగ్ర చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే ప్రభుత్వం ఎలాంటి అడుగైనా వేయాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డును స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే, విద్యారంగానికి సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియపై స్పష్టత కొరవడిందని చెబుతూ... "స్కూల్ విద్యలో ఇంటర్‌ను విలీనం చేస్తారా? లేక ఇంటర్ విద్యలో పాఠశాల విద్యను కలుపుతారా? అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని అన్నారు.9, 10, 11, 12 తరగతుల విధానం వస్తే తల్లిదండ్రులపై మరింత భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్ విద్య కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, నిధుల విడుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఆమె తప్పుబట్టారు. కేంద్రం నుంచి కరవు సహాయం తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. కరవు ప్రభావిత మండలాలపై ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించాలని, రైతులకు పంటల ధరలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయ వేదికపై తెలంగాణ కర్రసాము

- అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తెలంగాణ
- డిసెంబర్ 11 నుంచి తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవం గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు
- ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు
- తొలిసారి ప్రదర్శన క్రీడగా తెలంగాణ సంప్రదాయ కర్రసాము
- క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు కేటాయించిన ప్రభుత్వం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ఇందులో భాగంగా తొలిసారిగా రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 భవిష్యత్తులో క్రీడారంగ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఈ క్రీడా సంబరాలకు సంబంధించి ఏర్పాట్ల పురోగతిపై ముఖ్యమంత్రి మంత్రి వాకిటి శ్రీహరితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. యువ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేలా ప్రారంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్టేడియాల అభివృద్ధి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించాలని సీఎం సూచించారు. నగరమంతా క్రీడా స్ఫూర్తి ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పోటీల నిర్వహణకు అవసరమైన స్టేడియాల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పనులపై నిరంతర విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రారంభ, ముగింపు వేడుకల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో పోటీలు జరగనున్నందున ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా మంత్రులకు బాధ్యతలు

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి జిల్లాల వారీగా బాధ్యతలను కేటాయించారు. - పొన్నం ప్రభాకర్ - హైదరాబాద్ - దుద్దిళ్ల శ్రీధర్ బాబు - రంగారెడ్డి - జూపల్లి కృష్ణారావు - మహబూబ్‌నగర్ - పొంగులేటి శ్రీనివాసరెడ్డి - వరంగల్ - అడ్లూరి లక్ష్మణ్ కుమార్ - కరీంనగర్ - తుమ్మల నాగేశ్వరరావు - ఖమ్మం - ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి - నిజామాబాద్ వీరంతా తమకు కేటాయించిన జిల్లాల్లో క్రీడల నిర్వహణ, స్టేడియాల సన్నద్ధత, ఇతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

జాతీయ వేదికపై తెలంగాణ కర్రసాము తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కర్రసాముకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ల

నిరుద్యోగ పట్టభద్రులకు
ఉపాధి కల్పించడమే లక్ష్యం
– దుంద్ర కుమారస్వామి



హైదరాబాద్: నిరుద్యోగ పట్టభద్రులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి దుంద్ర కుమారస్వామి అన్నారు. 'మన మాట పట్టభద్రుల బాట' కార్యక్రమంలో భాగంగా మన్నన్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచాలని, ప్రభుత్వ నియామకాలు వేగవంతం చేయాలని సూచించారు. ఆరేళ్ల ఎమ్మెల్సీ ప్రాతినిధ్యంలో వాణి దేవి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఎంపికైన అభ్యర్థులకు స్పాట్ ఆఫర్ లెటర్లు అందించే ఏర్పాట్లు చేశారు.

కడప జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, పైప్ లైన్ ధ్వంసంపై వివరణ కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు
– కేసుల నమోదు, తీసుకున్న చర్యలపై సీఎం కార్యాలయానికి జిల్లా కలెక్టర్ నివేదిక

అమరావతి : కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఆయన, తక్షణమే పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎం కార్యాలయం జిల్లా అధికారుల నుంచి సమగ్ర నివేదిక కోరింది. ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు ప్రజల అవసరాలకు ఉద్దేశించిన తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేయడాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సీఎంఓ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా, అక్రమ మైనింగ్‌కు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించవద్దని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను సీఎంవోకు నివేదించారు. ప్రొద్దుటూరు మండలంలోని సోములవారిపల్లి వద్ద ఇసుక తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించారని కలెక్టర్ తెలిపారు. తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు అక్రమ తవ్వకాలను, ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేశారని వివరించారు. ఈ అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్లు, వాటి యజమానులు, ఈ ఘటనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వ్యక్తుల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారని... ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన నిందితులు, ట్రాక్టర్ యజమానులపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశామని, దెబ్బతిన్న పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించామని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు. పెన్నా, చిత్రావతి నదీ తీర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌ను కట్టడి చేసేలా జిల్లా, మండల స్థాయి కమిటీలను నియమించామని చెప్పారు. పెన్నా, చిత్రావతి నదుల పరివాహక ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు సమన్వయంతో పనిచేస్తూ చెక్‌పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. పెన్నా నది వెంబడి నిరంతర నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఇటువంటి అక్రమాలు, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎం ఆదేశాలను సీఎంఓ



జిల్లా కలెక్టర్‌కు తెలియజేసింది.

భర్తతో గొడవ.. వివాహిత ఆత్మహత్య



హైదరాబాద్ ఉప్పల్ విజయపురి కాలనీలో భర్తతో జరిగిన గొడవ కారణంగా ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. జనగామ జిల్లా పసరమడ్లకు చెందిన మాధవి (32)కి 14 ఏళ్ల క్రితం శ్రీధర్‌తో వివాహమైంది. అదనపు కట్నం కింద ఎకరం భూమి ఇచ్చినప్పటికీ, భర్త వేధింపులు తగ్గలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం భర్తతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మాధవి మంగళవారం ఉరివేసుకొని సూసైడ్ చేసుకుంది. మాధవి తండ్రి ఫిర్యాదుతో ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బాచుపల్లి సెప్టిక్ ట్యాంక్ ఘటన
తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరణ

హైదరాబాద్ : బాచుపల్లి, హైదరాబాద్‌లోని దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్స్‌లో సెప్టిక్ ట్యాంక్ / సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సంప్‌ను శుభ్రం చేస్తుండగా విషవాయువులు పీల్చడం వల్ల ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషాద ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ , గౌరవ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, సుమోటోగా విచారణకు స్వీకరించింది.ఈ విషాద ఘటనపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదకరమైన శుభ్రపరిచే పనుల సమయంలో పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం, రక్షణకు సంబంధించిన అంశాలతో పాటు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించడంలో జరిగినట్లు ఆరోపిస్తున్న ఉల్లంఘనలపై తీవ్ర సందేహాలు తలెత్తుతున్నాయని కమిషన్ అభిప్రాయపడింది.ఈ నేపథ్యంలో కమిషన్ క్రింది అధికారుల నుంచి వివరణాత్మక నివేదికలను కోరింది:1.తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ కార్యదర్శి ? ఘటనకు దారితీసిన పరిస్థితులు, సెప్టిక్ ట్యాంకులు / ఎస్టీపీ సంప్‌ల శుభ్రపరిచే పనులకు వర్తించే భద్రతా చర్యలు మరియు నిబంధనలు, అపార్ట్‌మెంట్ యాజమాన్యం మరియు కాంట్రాక్టర్ బాధ్యతలు, నిర్వహించిన తనిఖీలు / విచారణ వివరాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు మరియు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన నివారణ చర్యలపై నివేదిక సమర్పించాలి .2.మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ముగ్గురు కార్మికుల మృతికి దారితీసిన పరిస్థితులు, సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టిన విచారణ వివరాలు, మృతుల కుటుంబాలకు అందించిన లేదా అందించనున్న సహాయం, ఎక్స్‌గ్రేషియా పరిహారం మరియు ఇతర సహాయ చర్యల వివరాలు, అలాగే బాధిత కుటుంబాల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలి.సంబంధిత అధికారులు తమ నివేదికలను 22.12.2026 లోగా సమర్పించాలని కమిషన్ ఆదేశించింది.

ఐదవ రోజుకు చేరిన టైగర్ ఆపరేషన్..
– కనుమూరు ఫారెస్ట్‌లోనే పెద్దపులి తిష్ట

– ట్రాకర్ సంకేతాలపై కొంత అంతరాయం

– పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారుల నిరంతర గాలింపు

కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం కనుమూరు ఫారెస్ట్‌లో పెద్దపులి సంచారం ఐదో రోజుకు చేరింది. గత ఐదు రోజులుగా అదే అటవీ ప్రాంతంలో పులి తిష్ట వేయడంతో అటవీశాఖ అధికారులు, ప్రత్యేక బృందాలు అప్రమత్తమైయాయి. గత రెండు రోజులుగా ట్రాకర్ ద్వారా పులి కదలికలకు సంబంధించిన సంకేతాలు స్పష్టంగా అందడం లేదని సమాచారం. దట్టమైన అటవీ ప్రాంతంలోకి పులి వెళ్లినప్పుడు ట్రాకర్ సంకేతాలను గుర్తించడంలో కొంత ఇబ్బంది ఎదురయ్యే అవకాశం. పులికి అవసరమైన ఆహారం, నీరు సమృద్ధిగా లభించడంతో పాటు అనువైన అటవీ వాతావరణం ఉండటంతో కనుమూరు ఫారెస్ట్‌లోనే తిష్ట వేసినట్లు సమాచారం. ట్రాకర్ సంకేతాలు స్పష్టంగా అందకపోయినా వెనక్కి తగ్గకుండా అటవీ ప్రాంతానికి అన్ని వైపులా నిఘా ఏర్పాటు చేసారు. పులి ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతర గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దపులిని ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా బంధించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఒంటరిగా అటవీ ప్రాంతాలు, పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి సంచారాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో ఏ. కుమార్ సూచించారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్...
– ప్రజల్లో భద్రతా భరోసా, అసాంఘిక శక్తులకు గట్టి హెచ్చరిక



ప్రకాశం : జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజల్లో పోలీసులపై భద్రతా నమ్మకాన్ని మరింత పెంపొందించడం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రకాశం జిల్లా పోలీసులు పలు ప్రాంతాల్లో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రధాన రహదారులు, సమస్యాత్మక ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణపై భరోసా కల్పిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో తమ దైనందిన కార్యక్రమాలు కొనసాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అద్దె కట్టలేక బస్టాప్‌నే నివాసంగా చేసుకున్న కుటుంబం..
– ఇద్దరు చిన్నారులతో తల్లి కన్నీటి వ్యథ

– కుటుంబం దీనస్థితిపై స్పందించిన విశాఖ సీపీ..

– షెల్టర్‌కు తరలించిన ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ్ మూర్తి



విశాఖ హనుమంతువాకకు చెందిన ఓ కుటుంబం దీనస్థితి హృదయాలను కలచివేస్తోంది. భర్త అనారోగ్యంతో మూడు నెలలుగా అద్దె చెల్లించలేకపోవడంతో ఇంటి యజమాని ఇంటిని ఖాళీ చేయించారని ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.ఎంత వేడుకున్నా కనికరించలేదని, ఇద్దరు చిన్న ఆడపిల్లలతో రెండు రోజులుగా వీఎంఆర్డీఏ పార్క్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో తలదాచుకుంటున్నామని వాపోయారు. ఒకరోజు పిల్లలతో సహా తాము భోజనం కూడా చేయలేదని చెప్పడం మరింత బాధ కలిగిస్తోంది.ఈ విషయం తెలుసుకున్న విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ్ మూర్తి స్పందించారు. కుటుంబాన్ని బస్టాప్ నుంచి రక్షించి జీవీఎంసీ రెడ్ క్రాస్ షెల్టర్ హోమ్‌కు తరలించారు.

కోలుకున్నరాప్తాడు ఘటన బాధితురాలు
– కేక్ కట్ చేసి సంతోషం పంచుకున్న వైద్య సిబ్బంది..



బెంగళూరు రాప్తాడు ఘటనలో గాయపడిన బాలిక ఆరోగ్యం మెరుగుపడింది. త్వరగా కోలుకోవాలనే ఆకాంక్షతో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆమెతో కేక్ కట్ చేయించారు.ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు..

జీడికల్ దేవస్థానాన్ని దేశవ్యాప్త పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలి
– భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..

– ఆలయ అభివృద్ధికి నా ఎంపీ నిధులు అందిస్తా..

– జీడికల్ వీరాచల రామచంద్ర స్వామి ఆలయ ప్రశాస్త్యాన్ని రాష్ట్ర వ్యాప్తం చేయాలి...

– భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి...

– ఆలయంలో చేసిన అభివృద్ధి, భక్తులకు కల్పించిన సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేయాలి...

– నూతన కమిటీ సభ్యులు దేవుని సేవకులుగా పని చేయాలి...

– రానున్న రోజులలో జీడికల్ ఆలయాన్ని అన్ని రకాలుగా మరింత అభివృద్ధి చేసుకుందాం.



జీడికల్ ఆలయ ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎంపీ డా. కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘనపూర్ లింగాల ఘనపూర్ మండలం జీడికల్ లోని శ్రీ వీరాచల రామచంద్ర స్వామి ఆలయ ధర్మ కర్తల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీ ఎమ్మెల్యే కి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం ఆలయ ధర్మ కర్తల కమిటీ చైర్మన్ మరియు సభ్యులతో ఆలయ ఈవో, ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గుర్రం బాలరాజు గౌడ్ మరియు కమిటీ సభ్యులకు ఎంపీ డా. కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడికల్ రామచంద్ర స్వామి వారి ఆలయానికి ఉన్న చరిత్ర, ప్రాశాస్త్యం చాలా గొప్పదని అందువల్లే మన జీడికల్ ఆలయానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. గతంలో జీడికల్ రామచంద్ర స్వామి ఆలయం నుండే యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి నిధులు వెళ్లెవని అన్నారు. నవంబర్ 23 నుండి డిసెంబర్ 05వరకు జరగనున్న శ్రీ వీరాచల రామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏర్పాటు నూతన ఆలయ ధర్మకర్తల కమిటీ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి, దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నేను ఎమ్మెల్యేగా తర్వాత మూడో స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ మూడు సంవత్సరాలలో ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు 3కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అలాగే జీడికల్ నుండి జనగామ వరకు 8కోట్లతో రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. జీడికల్ ఆలయానికి ఉన్న ప్రాశాస్త్యాన్ని పెంపొందించే విధంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. 24గంటలు త్రాగు నీరు, విద్యుత్, పారిశుద్యం, వైద్య సేవలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ రోజు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ కమిటీ సభ్యులు దేవుని సేవకులుగా పని చేయాలని అన్నారు. రానున్న రోజులలో జీడికల్ ఆలయాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి దేవస్థానాన్ని దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వపరమైన సహకారంతో పాటు తన ఎంపీ నిధులను కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. రాష్ట్రంలోని యాదాద్రి, స్వర్ణగిరి వంటి పుణ్యక్షేత్రాలతో పాటు దేశంలోని ప్రముఖ దేవాలయాలకు భక్తుల తాకిడి పెరుగుతోందని తెలిపారు. అదే స్థాయిలో జీడికల్ దేవస్థానాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దేవాలయాలకు వచ్చే భక్తులు కేవలం దర్శనం మాత్రమే కాకుండా ఆలయ పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీ, పారిశుద్యం వంటి సౌకర్యాలను కూడా గమనిస్తారని ఎంపీ పేర్కొన్నారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు సుమారు 40 నుంచి 50 వేల మంది భక్తులు హాజరైనట్లు తెలుస్తుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే వచ్చే ఏడాది లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జీడికల్ దేవస్థానానికి మంచి పేరు రావాలంటే ప్రతి శాఖ 100 శాతం అంకితభావంతో పనిచేయాలని సూచించారు.జీడికల్ ఆలయంలో భక్తులకు శాశ్వత వసతి సౌకర్యాలు కల్పించే దిశగా ఆలోచించాలని సూచించారు. బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాల సమయంలో మూడు రోజుల పాటు భక్తులు ఇక్కడే ఉండేలా గెస్ట్‌హౌస్‌లు, గెస్ట్‌రూమ్‌లు నిర్మించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖలు సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని అన్నారు.ఇప్పటికే తన ఎంపీ నిధుల నుంచి దేవస్థానం వద్ద హైమాస్ట్ లైట్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమైతే ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనల మేరకు ఎంపీ నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అదేవిధంగా ఒక స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో) సహకారంతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు జీడికల్‌కు తరలివచ్చేలా పుణ్యక్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్, ఎంపిడివో, వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈవో, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం బాలరాజు గౌడ్, డైరెక్టర్లు, స్థానిక సర్పంచ్ కొండబోయిన మమత, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆధ్యాత్మిక సందడి

- 420 మంది చెంచు భక్తులకు ఉచిత స్పర్శదర్శనం
- డిసెంబరు దర్శనాలు, ఆర్జిత సేవల టికెట్లు విడుదల
- 80 శాతం టికెట్లు మనమిత్ర వాట్సాప్‌లోనే
- రుద్రవనంలో కార్తీక వనభోజనాలు, ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు
- సాక్షిగణపతి, వీరభద్రస్వామికి విశేష అభిషేకాలు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)కార్తీకమాసం సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఒకవైపు కార్తీక వనభోజనాలు.. మరోవైపు చెంచు గిరిజనులకు స్వామివారి ఉచిత స్పర్శదర్శనం.. ఇంకోవైపు డిసెంబరు నెల దర్శనాలు, ఆర్జిత సేవల టికెట్ల విడుదలతో క్షేత్రంలో సందడి నెలకొంది. రుద్రవనంలో సంప్రదాయబద్ధంగా ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించగా, సాక్షిగణపతి, జ్వాలావీరభద్రస్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నిత్యకళారాధనలో భాగంగా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

420 మంది చెంచు భక్తులకు స్పర్శదర్శనం..

శ్రీశైల క్షేత్రంతో అనాదిగా అనుబంధం కలిగిన చెంచు గిరిజనులకు దేవస్థానం ప్రత్యేక గౌరవం కల్పిస్తోంది. ప్రతి నెల చివరి బుధవారం ఉచిత స్పర్శదర్శనం కల్పించాలన్న నిర్ణయంలో భాగంగా బుధవారం 420 మంది చెంచు గిరిజన భక్తులకు స్వామివారి, అమ్మవారి స్పర్శదర్శనం కల్పించారు. వివిధ చెంచుగూడెంల నుంచి వచ్చిన గిరిజనులు సంప్రదాయ తప్పెట వాయిద్యాలు, చెంచు నృత్యాలతో దర్శనానికి తరలివచ్చారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం అన్నపూర్ణ ప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదాలు అందించారు.తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే మేకలబండ చెంచుగూడెంను సందర్శించినప్పుడు గిరిజనులు స్పర్శదర్శనం కల్పించాలని కోరారని రమేష్‌నాయుడు తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు గత ఏడాది ధర్మకర్తల మండలిలో తీర్మానం చేసి డిసెంబరు 30 నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. భక్తుల ఎంపికలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సహకారం తీసుకుంటున్నట్లు వివరించారు.

డిసెంబరు దర్శన టికెట్లు విడుదల..

డిసెంబరు నెలకు సంబంధించి స్వామివారి స్పర్శదర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలతోపాటు 14 రకాల ఆర్జిత సేవల టికెట్లను దేవస్థానం బుధవారం విడుదల చేసింది. భక్తుల సౌకర్యార్థం 80 శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సాప్ ద్వారా, మిగిలిన 20 శాతం టికెట్లను ఏపీఎస్‌టీ వెబ్‌సైట్ ద్వారా పొందే



అవకాశం కల్పించారు.మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా పొందవచ్చు.గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుంజయ హోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం తదితర 14 రకాల సేవలకు టికెట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్లు పొందిన భక్తులు వాటి హార్డుకాపీతో పాటు ఆధార్ ఒరిజినల్ లేదా జిరాక్స్ తీసుకురావాలని అధికారులు సూచించారు. టికెట్ల లభ్యతను బట్టి ఆర్జిత సేవలకు గంట ముందు వరకు కూడా టికెట్లు పొందే సదుపాయం కల్పించారు.

డిసెంబరు 9 వరకు కొన్ని సేవలు నిలిపివేత..

కార్తీకమాసం రద్దీ దృష్ట్యా డిసెంబరు 9 వరకు రూ.5 వేల గర్భాలయ అభిషేకం, రూ.1,500 సామూహిక అభిషేకాలతోపాటు ఉదయాస్తమాన, ప్రాతఃకాల, ప్రదోషకాల సేవలను నిలిపివేశారు. ఆర్జిత హోమాలు, కల్యాణోత్సవం యథావిధిగా కొనసాగుతాయి. డిసెంబరు 5, 6, 7 తేదీల్లో స్పర్శదర్శనం పూర్తిగా నిలిపివేస్తారు. రద్దీ రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో జరిగే రూ.1,000 కుంకుమార్చనను ఆశీర్వచన మండపంలో నిర్వహించనున్నారు. డిసెంబరు 20న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం మొదటి స్పర్శదర్శనం స్లాట్‌ను రద్దు చేశారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటల నుంచి ఉచిత సర్వదర్శనం ఉంటుంది.



రుద్రవనంలో వనభోజనాలు

కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ఆలయ ఈశాన్య భాగంలోని రుద్రవనం (రుద్రాపార్కు)లో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ముందుగా ఉసిరిచెట్టుకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది కుటుంబసమేతంగా పాల్గొన్నారు.
వైదిక సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోపాటు ఆలయ ఆచారాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వనసమారాధన నిర్వహిస్తున్నట్లు రమేష్‌నాయుడు తెలిపారు. శ్రీశైల మహాక్షేత్రంలో వనభోజనాలు ఆచరించడం విశేష ఫలితాన్నిస్తుందని ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నోరి నారాయణమూర్తి కార్తీకమాసం, వనభోజనాల విశిష్టతపై ప్రవచనం చేశారు. నందికొట్కూరుకు చెందిన లిఖితాశ్రీ నృత్యకళాశాల కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శన ఇచ్చారు.

సాక్షిగణపతి, వీరభద్రస్వామికి విశేష పూజలు

లోకకల్యాణం కోసం సాక్షిగణపతి స్వామివారికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పార్చన, నివేదన చేశారు. ప్రతి బుధవారం, సంకటహర చవితి, పౌర్ణమి రోజుల్లో దేవస్థానం తరఫున ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీ.
అలాగే ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామివారికి ప్రదోషకాలంలో విశేష పూజలు చేశారు. పంచామృతాలు, వివిధ ఫలోదకాలు, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతో అభిషేకం నిర్వహించి పుష్పార్చన చేశారు.

నిత్యకళారాధనలో నృత్య ప్రదర్శనలు..

దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన వేదికపై హైదరాబాద్‌కు చెందిన దుర్గా ప్రశాంత్ కుమార్ కందుల కూచిపూడి కళాక్షేత్రం కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
మూషికవాహన, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో, శివపంచాక్షరి, శివోహం తదితర గీతాలకు నృత్యరూపకాలు ప్రదర్శించారు. ప్రాచీన కళల పరిరక్షణ, స్వామి అమ్మవార్ల కైంకర్యాల పరిపూర్ణత లక్ష్యంగా ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం తెలిపింది.

గుడివాడ నీదా... నాదా..

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమరం వేడెక్కుతున్న వేళ, కృష్ణా జిల్లాలోని గుడివాడ మున్సిపాలిటీఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. 48 వార్డులు, ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎంపికయ్యే బీసీ మహిళా చైర్‌పర్సన్ పదవి కోసం నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 30న కౌంటింగ్ జరగనుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టణంపై తన పట్టును నిలుపుకుంటూ కూటమి శ్రేణులను ముందుండి నడిపిస్తుండగా, మాజీ మంత్రి కొడాలి నాని వైసీపీ అభ్యర్థుల తరఫున పరోక్షంగా పావులు కదుపుతూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో కొడాలి నాని వ్యవహారశైలి తెర వెనుక రాజకీయాలకే పరిమితమయింది. నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని అభ్యర్థుల ఎంపిక వరకు అయన నేరుగా రంగంలోకి దిగి జోక్యం చేసుకోకపోయినప్పటికీ, తెరవెనుక కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్థానిక వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బరిలో నిలిచిన వైసీపీ అభ్యర్థులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ, ఎక్కడా వెనక్కి తగ్గకుండా గట్టిగా పోరాడాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. 2024 పరాజయం, ఆ తర్వాత కొంతకాలం అనారోగ్య కారణాలతో దూరంగా ఉన్నారు. ఇప్పుడు రాజకీయంగానూ యాక్టివ్‌గా ఉండలేకపోతున్నారు. ఈ మున్సిపల్ పోరు ద్వారా క్షేత్రస్థాయిలో వైసీపీ శ్రేణుల్లో మళ్లీ పట్టు నిరూపించుకోవాలన్న పట్టుదల నాని శిబిరంలో కనిపిస్తోంది.మరోవైపు, అధికార ఎన్డీయే కూటమి తరఫున ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టణ రాజకీయాలపై గట్టి పట్టు సాధిస్తూ, ప్రతి వార్డులోనూ కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గ పరిధిలో కూటమి సాధించిన విజయాల జోష్‌ను మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని టీడీపీ–జనసేన–బీజేపీ నేతలు భావిస్తున్నారు. 12 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ మున్సిపల్ ఎన్నికల్లో 48 వార్డుల వారీగా బలాబలాలను లెక్కగడుతూ, చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి యంత్రాంగం దూకుడుగా ప్రచారం చేస్తోంది.నామినేషన్ల ఘట్టం ముగిసి అభ్యర్థుల తుది జాబితా ఖరారు కావడంతో గుడివాడ పట్టణంలోని 48 వార్డుల్లో పోటాపోటీ వాతావరణం నెలకొంది. వైసీపీ తరఫున చైర్‌పర్సన్ అభ్యర్థిగా కరుణ బరిలో నిలవగా, కూటమి తరఫున అభ్యర్థుల ఎంపిక,అసమ్మతి సర్దుబాట్లపై నేతలు నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. ఒకవైపు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుండగా, మరోవైపు కొడాలి నాని ఆర్థిక, వ్యూహాత్మక మద్దతుతో వైసీపీ అభ్యర్థులు వార్డుల వారీగా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము క్షేత్రస్థాయి పట్టుకు, కొడాలి నాని పరోక్ష వ్యూహానికి మధ్య జరుగుతున్న ఈ పోరు గుడివాడ రాజకీయ భవిష్యత్తుకు కీలక మలుపుగా మారింది. పోలింగ్‌కు ఇంకొన్ని రోజులే సమయం ఉండటంతో, వార్డుల వారీగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరువర్గాలూ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గుడివాడ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారు, మున్సిపల్ పీఠం ఎవరి వశమవుతుందనేది నవంబర్ 30న తేలనుంది.గుడివాడ మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వెనిగండ్ల రాము ఘనవిజయం సాధించిన తర్వాత, పట్టణ స్థాయిలో మళ్లీ బలం పుంజుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. 48 వార్డుల్లోనూ బలమైన అభ్యర్థులను నిలబెట్టడం, కూటమిలో కొన్ని వార్డుల్లో టికెట్ల ఆశావహుల మధ్య నెలకొన్న పోటీ వంటి అంశాలు ఎన్నికలను హోరాహోరీగా మారుస్తున్నాయి.కొడాలి నాని గతంలో సుదీర్ఘకాలం గుడివాడ రాజకీయాలను శాసించిన అనుభవం, ఆయనకు ఉన్న క్యాడర్ బలం, ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు అందుతున్న ఆర్థిక మద్దతు వైసీపీకి ప్రధాన బలాలు. నాని నేరుగా జోక్యం చేసుకోకపోయినా, గట్టిగా పోరాడాలన్న సంకేతంతో అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఓటమి, అలాగే ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాల తో డర్‌లో కొంతమేర నైతిక స్థైర్యం దెబ్బతినడం వైసీపీకి ప్రతికూలాంశం. కీలక నేత నేరుగా ప్రచారంలో ముందుండి నడిపించకపోవడం కూడా కొన్ని వార్డుల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది.రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలో ఉండటం, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టణంపై పట్టు బిగించి వార్డుల వారీగా సమన్వయం చేస్తుండటం కూటమికి పెద్ద ప్లస్. ఇటీవలి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలు, ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి హామీలు కూటమి అభ్యర్థులకు సానుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయి.48 వార్డుల్లో టికెట్లు ఆశించిన కొందరు నేతల్లో అసంతృప్తి వల్ల కొన్ని చోట్ల ఓట్లు చీలే ప్రమాదం ఉంది. అలాగే, వైసీపీ అభ్యర్థులకు అందుతున్న ఆర్థిక బలాన్ని, వార్డుస్థాయిలో పాత అనుబంధాలను తట్టుకుని ప్రతి వార్డును గెలుచుకోవడం కూటమికి సవాలే.ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులు, 2024 అసెంబ్లీ ఫలితాలు, ఇటీవలి స్థానిక ఎన్నికల ట్రెండ్ , అధికార కూటమి బలాన్ని పరిశీలిస్తే గుడివాడ మున్సిపాలిటీలో కూటమికి మెరుగైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, కొడాలి నాని పరోక్ష వ్యూహం, ఆర్థిక మద్దతుతో వైసీపీ గట్టి పోటీ ఇస్తున్నందున కొన్ని వార్డుల్లో ఫలితాలు తృటిలో తేడా వచ్చే అవకాశం కూడా లేకపోలేదు.

కూటమిలో కుంపట్లు...

కాకినాడ : స్థానిక సంస్థల ఎన్నికలు దాదాపుగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కూటమి పార్టీల మధ్య ఉండదు. అయితే కూటమిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకరకంగా చిచ్చుపెట్టాయనే చెప్పాలి. ప్రధానంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతల్లో అసంతృప్తి అయితే క్రమంగా బయటపడుతుంది. జనసేనలో పై స్థాయి నేతలు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం నేతలు పార్టీ నిర్ణయం పట్ల ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు.సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఛైర్మన్లు, వైస్ ఛైర్లన్లు చేయడం కూడా జనసేన ద్వితీయ శ్రేణి నేతలకు మింగుడుపడటం లేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి జనసేన కింది స్థాయి నేతలు ఇప్పుడు బయట పడటం లేదు. కానీ రానున్న కాలంలో జనసేనను నమ్ముకుంటే తమకు పదవులు రావన్న విషయం అర్థమయి వారు పార్టీకి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు.. పవన్ కల్యాణ్ , జనసేన మంత్రుల విషయంలో సాఫ్ట్ కార్నర్ గా ఉంటే సరిపోదు. కింది స్థాయిలో నేతలు మాత్రం తాము అన్యాయానికి గురవుతున్నారన్న భావనలో ఉన్నారు. ప్రధానంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా జనసేన క్యాడర్ కు న్యాయం జరగడం లేదు. జనసేన కార్యకర్తలను దూరం పెడుతూ వస్తున్నారని, జనసేన టీడీపీ మధ్య గ్రౌండ్ లెవెల్లో చీలికలు స్టార్ట్ అయ్యాయని లీడర్లే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల డైరెక్ట్ తిరుగుబాట్లు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల నాటికి ఇవి పీక్స్ లోకి చేరాయి. ఏ స్థాయికి వచ్చాయి అంటే ఆఖరి దశలో ఏకంగా జనసేన పార్టీ ఆఫీసియల్ గా స్వేచ్ఛగా పోటీ చేసుకోండి అని లెటర్ విడుదల చేసింది. కానీ అప్పటికే డ్యామేజ్ అయిపోయింది. లాస్ట్ మూమెంట్ లో ఆర్డర్ వచ్చినా టీడీపీ వాళ్ళు కనీసం నామినేషన్ కూడా వెయ్యనివ్వడం పోవడం చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం వైస్ ఛైర్మన్ ఎన్నిక లో కూడా గందరగోళం నెలకొంది. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అనుచరుడు చక్రిపై జనసేన నేతలు దాడి చేశారు.పిఠాపురం వైస్ ఛైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు బొజ్జ వెంకటేశ్వరరావు, పిండి సంధ్యాల మధ్య పోటీ నెలకొంది. వైసీపీ నుంచి వచ్చిన బొజ్జ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంతో స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. స్థానిక నాయకత్వం పవన్ కల్యాణ్ ను తప్పుదోవపట్టించి వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించవద్దంటూ కౌన్సిలర్లతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మంతనాలు జరిపారు. ఏకగ్రీవంగా వైస్ ఛైర్మన్ బొజ్జ వెంకటేశ్వరరావు ఎన్నిక పూర్తయింది. ఈ నేపద్యంలో జనసేన మళ్ళీ టీడీపీకి 2024 స్థాయి మద్దతు ఇవ్వడానికి క్యాడర్ సిద్ధంగా లేదని చెబుతున్నారు. బీజేపీ జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అసంతృప్తిని ప్రకటించగా, తాజాగా విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా డిప్యూటీ మేయర్ తమకు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు.

టీడీపీకి దూరమౌతున్న
సొంత సామాజిక వర్గం

గుంటూరు : తలుగుదేశం పార్టీ తన సంప్రదాయ ఓటు బ్యాంకు అయిన కమ్మ సామాజికవర్గం దూరం చేసుకుంటుందా? అంటే ఉద్దేశపూర్వకంగా దూరం చేసుకోవడం లేకపోయినా, అయితే ప్రస్తుత రాజకీయ సమీకరణాల వల్ల ఆ వర్గంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా పదవుల విషయంలో సామాజికవర్గం బూచిగా చూపెట్టి తమను పక్కన పెట్టినా కాంట్రాక్టులు, ఇతర పనులు, ఆర్థిక వనరులను అందించడంలో మాత్రం సహకరించడం లేదన్న అసంతృప్తి కమ్మ సామాజికవర్గం నేతల్లో నెలకొని ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ సామాజికవర్గం జనాభా పరంగా సుమారు 5నుంచి 6 శాతం మాత్రమే ఉంది.

ఎన్నికల్లో విజయం సాధించాలంటే బీసీ, కాపు, ఎస్సీ, మైనారిటీ వంటి ఇతర ప్రధాన వర్గాల మద్దతు అత్యవసరం. అందుకే 2024 ఎన్నికల తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలోనూ, ఇతర పదవుల పంపిణీలోనూ టీడీపీ అధినాయకత్వం బీసీ, కాపు సామాజికవర్గాలకు పెద్దపీట వేసింది. గతంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో కమ్మ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేతలకు ఆశించిన స్థాయిలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు దక్కలేదనే భావన ఆ వర్గంలో ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కేసులు, ఇబ్బందులు ఎదుర్కొన్నామని, అధికారం వచ్చాక తగిన గుర్తింపు లభించలేదని కొందరు నేతలు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అంటే కేవలం కమ్మ సామాజికవర్గ పార్టీ అనే విమర్శను ప్రత్యర్థి పార్టీలు ఎప్పుడూ అస్త్రంగా వాడుకుంటూ వస్తున్నాయి. 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమికి ఈ ముద్ర కూడా ఒక కారణమని విశ్లేషకులు భావించారు. ఆ ముద్రను తొలగించుకుని, అన్ని వర్గాల పార్టీగా కనిపించేందుకే చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ వర్గాల అంచనా. 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో పొత్తు కారణంగా సీట్ల సర్దుబాటులో భాగంగా పలు నియోజకవర్గాలను మిత్రపక్షాలకు కేటాయించాల్సి వచ్చింది. దీనివల్ల కూడా కమ్మ సామాజికవర్గానికి చెందిన పలువురు ఆశావహులకు అవకాశాలు తగ్గాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్నారు. ఒకవైపు పదవుల విషయంలో అసంతృప్తి ఉన్నప్పటికీ, పార్టీ అగ్రనాయకత్వంలో ఉన్న చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కమ్మ సామాజికవర్గానికి చెందినవారే కావడం, అలాగే కీలకమైన కొన్ని జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు, ఇతర ముఖ్య బాధ్యతల్లో ఆ వర్గ నేతలకు ప్రాధాన్యత ఉండటంతో పూర్తిస్థాయిలో దూరమయ్యే పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఇతర సామాజికవర్గా లను కలుపుకుపోయే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులని చెబుతున్నప్పటికీ కమ్మ సామాజికవర్గంలో ఈ దఫా టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ అసంతృప్తితో ఉన్నారు. అయితే ఎన్నికలు వచ్చే సమయానికి వారు పార్టీకి దూరం కారన్న ధీమాలో నాయకత్వం ఉంది. అందులో కూడా వాస్తవం లేకపోలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

కూటమిలో కుంపట్లు...

కాకినాడ : స్థానిక సంస్థల ఎన్నికలు దాదాపుగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కూటమి పార్టీల మధ్య ఉండదు. అయితే కూటమిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకరకంగా చిచ్చుపెట్టాయనే చెప్పాలి. ప్రధానంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతల్లో అసంతృప్తి అయితే క్రమంగా బయటపడుతుంది. జనసేనలో పై స్థాయి నేతలు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం నేతలు పార్టీ నిర్ణయం పట్ల ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు.సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఛైర్మన్లు, వైస్ ఛైర్లన్లు చేయడం కూడా జనసేన ద్వితీయ శ్రేణి నేతలకు మింగుడుపడటం లేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి జనసేన కింది స్థాయి నేతలు ఇప్పుడు బయట పడటం లేదు. కానీ రానున్న కాలంలో జనసేనను నమ్ముకుంటే తమకు పదవులు రావన్న విషయం అర్థమయి వారు పార్టీకి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు.. పవన్ కల్యాణ్ , జనసేన మంత్రుల విషయంలో సాఫ్ట్ కార్నర్ గా ఉంటే సరిపోదు. కింది స్థాయిలో నేతలు మాత్రం తాము అన్యాయానికి గురవుతున్నారన్న భావనలో ఉన్నారు. ప్రధానంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా జనసేన క్యాడర్ కు న్యాయం జరగడం లేదు. జనసేన కార్యకర్తలను దూరం పెడుతూ వస్తున్నారని, జనసేన టీడీపీ మధ్య గ్రౌండ్ లెవెల్లో చీలికలు స్టార్ట్ అయ్యాయని లీడర్లే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల డైరెక్ట్ తిరుగుబాట్లు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల నాటికి ఇవి పీక్స్ లోకి చేరాయి. ఏ స్థాయికి వచ్చాయి అంటే ఆఖరి దశలో ఏకంగా జనసేన పార్టీ ఆఫీసియల్ గా స్వేచ్ఛగా పోటీ చేసుకోండి అని లెటర్ విడుదల చేసింది. కానీ అప్పటికే డ్యామేజ్ అయిపోయింది. లాస్ట్ మూమెంట్ లో ఆర్డర్ వచ్చినా టీడీపీ వాళ్ళు కనీసం నామినేషన్ కూడా వెయ్యనివ్వడం పోవడం చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం వైస్ ఛైర్మన్ ఎన్నిక లో కూడా గందరగోళం నెలకొంది. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అనుచరుడు చక్రిపై జనసేన నేతలు దాడి చేశారు.పిఠాపురం వైస్ ఛైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు బొజ్జ వెంకటేశ్వరరావు, పిండి సంధ్యాల మధ్య పోటీ నెలకొంది. వైసీపీ నుంచి వచ్చిన బొజ్జ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంతో స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. స్థానిక నాయకత్వం పవన్ కల్యాణ్ ను తప్పుదోవపట్టించి వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించవద్దంటూ కౌన్సిలర్లతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మంతనాలు జరిపారు. ఏకగ్రీవంగా వైస్ ఛైర్మన్ బొజ్జ వెంకటేశ్వరరావు ఎన్నిక పూర్తయింది. ఈ నేపద్యంలో జనసేన మళ్ళీ టీడీపీకి 2024 స్థాయి మద్దతు ఇవ్వడానికి క్యాడర్ సిద్ధంగా లేదని చెబుతున్నారు. బీజేపీ జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అసంతృప్తిని ప్రకటించగా, తాజాగా విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా డిప్యూటీ మేయర్ తమకు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు.

క్యాడర్‌ను కాపాడుకునేదెలా...

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీ ప్రస్థానం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 2019 ఎన్నికల్లో కేవలం ఒక్క ఎమ్మెల్యే స్థానానికే పరిమితమైన ఆ పార్టీ, 2024 ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక భాగస్వామిగా ఎదిగింది. ఇప్పుడు స్థానిక సంస్థల్లోకూడా ప్రాతినిధ్యం పెరగడంతో జనసేన భవిష్యత్తుపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూటమిలో కొనసాగుతూనే సొంతంగా పార్టీని బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీ తో కలిసి పోటీ చేసిన జనసేన మొత్తం 21 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. రెండు లోక్‌సభ స్థానాలను కూడా గెలుచుకుంది. ఆ తర్వాత రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లోనూ పార్టీకి ప్రాతినిధ్యం లభించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంలో జనసేన పాత్ర మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం జనసేన రాజకీయ ప్రస్థానంలో కీలక పరిణ

కారులో ఒక్కరే ఉంటే ఫైన్‌నా.?

ట్రాఫిక్ తగ్గించేందుకు కార్‌పూలింగ్‌పై పోలీసుల దృష్టి

జరిమానా అంటూ ప్రచారం.. వాస్తవం మాత్రం అవగాహన కార్యక్రమం!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా పోలీసులు కార్‌పూలింగ్ (ఒకే వాహనంలో పలువురు కలిసి ప్రయాణించడం) విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. అయితే కారులో ఒక్కరే ప్రయాణిస్తే జరిమానా విధిస్తారనే ప్రచారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఒక్కరే ప్రయాణిస్తే జరిమానా వేస్తారా.?

కారులో ఒక్కరే ప్రయాణిస్తున్నారనే కారణంతో ఫైన్ విధించే కొత్త నిబంధన అమల్లోకి వచ్చినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రజలకు చేసిన విజ్ఞప్తి ప్రధానంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినది. కాబట్టి కారులో ఒంటరిగా ప్రయాణించే ప్రతి ఒక్కరికీ జరిమానా తప్పదని భావించడం సరైంది కాదు.

కార్‌పూలింగ్ ఎందుకు అవసరం.?

ఒకే ప్రాంతం నుంచి ఒకే కార్యాలయానికి వెళ్లే నలుగురు వ్యక్తులు నాలుగు కార్లలో కాకుండా ఒకే కారులో ప్రయాణిస్తే రహదారిపై మూడు కార్ల రద్దీ తగ్గుతుంది. దీనివల్ల ఇంధన ఖర్చు తగ్గడంతో పాటు వాహనాల సంఖ్య, కాలుష్యం, పార్కింగ్ సమస్యలు కూడా కొంతవరకు తగ్గుతాయి.

ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న రద్దీ

సైబరాబాద్ పరిధిలోని జేఎన్‌టీయూ నుంచి ఐకియా ఐటీ కారిడార్ వైపు వెళ్లే ప్రయాణికుల్లో సుమారు 65 శాతం మంది గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే రోడ్లపైకి వస్తున్నట్లు ట్రాఫిక్ అధ్యయనాల్లో వెల్లడైంది. దీంతో ఒకేసారి భారీగా వాహనాలు రోడ్లపైకి రావడం ట్రాఫిక్ సమస్యను మరింత పెంచుతోంది.

నో సోలో.. సాత్ చలో

నవంబర్ 26 నుంచి 28 వరకు 'సైబరాబాద్ మూవ్స్–2026' పేరుతో మూడు రోజుల పట్టణ రవాణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కార్‌పూలింగ్, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. 'హాయ్ బోలో.. దిల్ ఖోలో.. నో సోలో.. సాత్ చలో' అనే నినాదంతో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రజలకు అసలు సందేశం ఏమిటి.?

కారులో ఒక్కరే వెళ్లకూడదని ప్రజలను బలవంతం చేయడం కంటే, ఒకే మార్గంలో వెళ్లేవారు కలిసి ప్రయాణించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. మెట్రో, ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ వంటి ప్రజా రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని కూడా పోలీసులు సూచిస్తున్నారు.

జరిమానా భయం కాదు.. బాధ్యతతో మార్పు రావాలి

ట్రాఫిక్ సమస్య ఒక్క పోలీసుల వల్లనే పరిష్కారం కాదు. వాహనదారుల సహకారం కూడా అవసరం. అయితే ప్రజల్లో అనవసర భయాందోళనలు కలగకుండా అధికారులు స్పష్టమైన అవగాహన కల్పించాలి. కారులో ఒక్కరే ప్రయాణిస్తే ఫైన్ వేస్తారనే ప్రచారానికి బదులుగా కార్‌పూలింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలి. రహదారులపై వాహనాల సంఖ్య తగ్గితేనే ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

ప్రజలు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం:

- కారులో ఒక్కరే ప్రయాణించడం వల్లనే ఫైన్ పడుతుందని నిర్ధారించే అధికారిక ప్రకటన లేదు.
- కార్‌పూలింగ్‌ను పోలీసులు ప్రోత్సహిస్తున్నారు.
- ఇది ట్రాఫిక్ రద్దీ, ఇంధన వినియోగం, కాలుష్యం తగ్గించే ప్రయత్నం.
- ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం సాధారణ చట్టాల ప్రకారం జరిమానాలు ఉంటాయి.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'సైబరాబాద్ మూవ్స్'

- రేపటి నుంచి మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు

- 'థింక్ ట్రాఫిక్.. టాక్ ట్రాఫిక్' అంటూ సీపీ డాక్టర్ ఎం. రమేష్ పిలుపు



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) సైబరాబాద్, పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారాలు కనుగొనే లక్ష్యంతో నవంబర్ 26 నుంచి మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు 'సైబరాబాద్ మూవ్స్' నిర్వహించనున్నారు. 'థింక్ ట్రాఫిక్.. టాక్ ట్రాఫిక్', 'వాహనాల కంటే ప్రజల ప్రయాణానికి ప్రాధాన్యత' అనే నినాదాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ వెల్లడించారు. బుధవారం సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజనతో కలిసి విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వం, సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. గురువారం ఉదయం పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అంతర్జాతీయ రవాణా నిపుణులు శశి వర్మ, బొగోటా నగర మేయర్ తదితరులు హాజరుకానున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ లండన్‌లో 97 శాతం మంది ప్రజా రవాణాను వినియోగిస్తుండగా, తెలంగాణలో సుమారు 74 శాతం మంది వ్యక్తిగత ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో బస్సుల కొరతను అధిగమించేందుకు ఆర్టీసీతో చర్చలు జరుపుతున్నామని, చివరి దశ ప్రయాణ అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రానున్న నాలుగైదేళ్లలో ఏటా వెయ్యి కొత్త బస్సులను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉందన్నారు. ఈ సదస్సులో రవాణా రంగ నిపుణులతో చర్చలు, ప్రత్యేక సమావేశాలు, ఆలోచనల పోటీ నిర్వహించనున్నారు.

ఇప్పటికే 93 పాఠశాలలు, 27 కళాశాలలు, 113 భాగస్వామ్య సంస్థలు, 62 నివాస సంక్షేమ సంఘాలు, 21 స్వచ్ఛంద సంస్థలు సహా పలువురు పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని సీపీ తెలిపారు.సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. సైబరాబాద్ మూవ్స్ కేవలం అధికారుల సమావేశం కాదని, నిత్యం ప్రయాణించే ప్రజలు, నిపుణులు తమ సమస్యలు, సూచనలు తెలియజేసే బహిరంగ వేదిక అని పేర్కొన్నారు. ప్రజల అనుభవాల ఆధారంగా ఆచరణాత్మక పరిష్కారాలు రూపొందించడమే లక్ష్యమన్నారు.

హైదరాబాద్‌లో భవిష్యత్తులో తీవ్రమైన ట్రాఫిక్ స్తంభన ఏర్పడకుండా ప్రజలు, మీడియా రవాణా సమస్యలపై చర్చించి పరిష్కారాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని సీపీ డాక్టర్ ఎం. రమేష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శేర్లింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రహదారిపైనే బెల్ట్ షాప్

- ఏళ్ల తరబడి సాగుతున్న మద్యం దందా.. అధికారుల నిర్లక్ష్యమెందుకు.? - తెల్లవారుజామునే కార్మికులకు మద్యం విక్రయాలు

- స్మశాన వాటిక ముందు టీ దుకాణంలో అక్రమ మద్యం అమ్మకాలు - టాస్క్‌ఫోర్స్ దాడి.. మద్యం బాటిళ్లు స్వాధీనం



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందా.? రహదారుల పక్కనే, టీ దుకాణాల ముసుగులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. తెల్లవారుజామునే కార్మికులకు మద్యం విక్రయిస్తూ వారిని మద్యానికి బానిసలుగా మారుస్తున్న అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తార్నాక విజయపురి కాలనీ ప్రధాన రహదారిపై, స్మశాన వాటిక ఎదురుగా ఉన్న ఓ టీ దుకాణంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల నిమిత్తం లాలాగూడ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.స్థానికుల కథనం ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా ఈ టీ దుకాణంలో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున ఆరు గంటలలోపే మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పనులకు వెళ్లే కార్మికులు ఈ అక్రమ విక్రయాలకు ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారిపై బహిరంగంగా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై ఇన్నాళ్లూ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు.? స్థానికుల ఫిర్యాదులు ఎందుకు పట్టించుకోలేదు.? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులకు తెలిపిన ఇప్పటివరకు దాడులు చేయకపోవడం వెనక అంతర్గత ఒప్పందాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ దాడిలో సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ జోన్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్, ఎస్ఐ మణికాంత్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, పీసీలు మనోజ్, భరత్ పాల్గొన్నారు.అక్రమ మద్యం విక్రయాలపై నిరంతర నిఘా పెట్టి, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్ విద్య ఎంతో కీలకం

- విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు

-కళాశాల ప్రిన్సిపాల్ కె. జితేందర్ రెడ్డి

- ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు

- విద్యార్థులకు ఉచిత దుస్తులు, బెల్టులు, ఐడీ కార్డుల పంపిణీ



జనగామ (ప్రశ్న న్యూస్)ప్రతి ఒక్కరి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైనదని, ఈ దశలో వచ్చే శారీరక, మానసిక ఆలోచనలు, కోరికలను అదుపులో పెట్టుకొని చదువుపై దృష్టి సారిస్తే జీవితంలో సాధించలేనిది ఏమీ ఉండదని కళాశాల ప్రిన్సిపాల్ కె. జితేందర్ రెడ్డి విద్యార్థులకు ఉద్బోధించారు.బుధవారం కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత దుస్తులు, బెల్టులు, ఐడీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు



చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య




రాష్ట్ర ప్రభుత్వం నేడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తోంది. కేజీబీవీ రెసిడెన్షియల్ కళాశాలలకు సమానంగా మెరుగైన కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ వయసులో వచ్చే ఆలోచనలు, కోరికలను నియంత్రణలో పెట్టుకొని చదువును లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు.క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో ఎన్నడూ లేని విధంగా సమూల మార్పులు తీసుకొస్తోందని అన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, నరేష్, సాయిదులు, హరిత, రహీమ్ పున్నిసా, చైతన్య, రాధిక, అనురాధ, వెంకటేశ్వర్లు, మ్యానిగిరి తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న సింగూరు.. నీటి సరఫరాపై ఆందోళన



హైదరాబాద్ : సింగూరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా, సంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమలకు బల్క్ వాటర్ సరఫరా డిసెంబర్ 20 తర్వాత నిలిచిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం సుమారు 1.95 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు వెల్లడైంది. సింగూరు–మంజీరా నీటిపై ఆధారపడే ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి నుంచి అదనంగా నీటిని తరలించేందుకు జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ ఎంబీఆర్‌కు నీటిని తీసుకొచ్చే పైప్‌లైన్ పనులు చివరి దశలో ఉన్నాయి. పటాన్‌చెరు పరిశ్రమలు, కాలుష్య ప్రభావిత గ్రామాలకు కూడా గోదావరి నీటిని మళ్లించాలని అధికారులు యోచిస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగర పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమలకు సింగూరు జలాలే చాలా కీలకం. అయితే సింగూరు జలాశయంలో నీళ్లు అడుగంటిపోవడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరానికి సింగూరు నీటి సరఫరా వచ్చే నెల 20వ తేదీ తర్వాత నిలిచిపోయే అవకాశం ఉందని పరిస్థితుల ద్వారా అర్థం అవుతోంది. సింగూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో అధికారులు ఈ అంచనాకు వచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తే డిసెంబర్ 20వ తేదీ వరకు నగరానికి సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. మరోవైపు.. దీనికి ప్రత్యామ్నాయంగా అదనంగా 40 మిలియన్ గ్యాలన్ల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించేందుకు జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. సింగూరు జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడం హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతాల నీటి అవసరాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. గోదావరి నీటి మళ్లింపు పనులు సకాలంలో పూర్తి చేస్తేనే ఈ ప్రాంతాల్లో నీటి సరఫరా ఇబ్బందులను కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరుల్లో ఒకటైన సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోవడం ప్రస్తుత పరిస్థితికి కారణం అవుతోంది. దీంతో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాతో పాటు సంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమలకు అందించే బల్క్ వాటర్ సరఫరాపైనా ప్రభావం పడనుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సింగూరు ప్రాజెక్టులో మిగిలిన నీరు సుమారు 1.99 టీఎంసీలు మాత్రమే ఉండటంతో వచ్చే నెల 20వ తేదీ తర్వాత అక్కడి నుంచి నీటి సరఫరా నిలిపివేయాల్సి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే సింగూరు జలాశయం, మంజీరా రిజర్వాయర్ పరిధిలో నీటి లభ్యతపై అధికారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నీటిని జాగ్రత్తగా వినియోగిస్తే డిసెంబర్ 20వ తేదీ వరకు సరఫరా కొనసాగించవచ్చని మంజీరా రిజర్వాయర్ సంగారెడ్డి డివిజన్ జనరల్ మేనేజర్ రామకృష్ణ వెల్లడించారు. ఆ తర్వాత ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడాల్సి ఉంటుందని పేర్కొన్నారు.సింగూరు–మంజీరా జలాలపై ఆధారపడే ప్రాంతాల్లో నీటి కొరతను తగ్గించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. గోదావరి నుంచి అదనంగా 40 మిలియన్ గ్యాలన్ల నీటిని (ఎంజీడీ) గ్రేటర్ హైదరాబాద్‌కు తరలించేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టింది. ఈ నీటితో ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లో సింగూరు–మంజీరా జలాలపై ఆధారపడే ప్రాంతాల్లో నీటి కొరతను కొంతవరకు అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో మూడు లక్షలకు పైగా నీటి కనెక్షన్లు ఉన్నాయని.. అదనపు గోదావరి జలాల సరఫరాతో సుమారు 50 శాతం వరకు ఈ లోటును భర్తీ చేయవచ్చని అంచనా వేస్తున్నారు.సింగూరు నీటి సరఫరా నిలిచిపోతే సంగారెడ్డి జిల్లాలోని పలు కీలక సంస్థలు, పరిశ్రమలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఐఐటీ హైదరాబాద్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) వంటి సంస్థలు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటిని పొందుతున్నాయి. సింగూరు జలాశయం నుంచి నీటి సరఫరా ఆగిన తర్వాత ఈ సంస్థలు, పరిశ్రమలతో పాటు పటాన్‌చెరు ప్రాంతంలోని కాలుష్య ప్రభావిత గ్రామాలకు గోదావరి జలాలను మళ్లించాలని అధికారులు భావిస్తున్నారు.మొదట పటాన్‌చెరుకు 20 ఎంజీడీల గోదావరి నీటిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని.. అవసరాన్ని బట్టి దాన్ని 40 ఎంజీడీలకు పెంచేందుకు అంగీకరించిందని మంజీరా రిజర్వాయర్ సంగారెడ్డి డివిజన్ జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఇతర ప్రాంతాల్లో మాత్రం నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావచ్చని పేర్కొన్నారు.అయితే గతంలో కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. 2019లోనూ సింగూరు ప్రాజెక్టు పూర్తిగా అడుగంటిన సమయంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. సింగూరు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో నీటిలో మునిగిపోయిన గ్రామాల ఆనవాళ్లు, పునాదులు కూడా ఆ సమయంలో బయటపడటం గమనార్హం. అప్పట్లో యెల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన గోదావరి నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పటాన్‌చెరుకు మళ్లించారు. ప్రస్తుత నీటి కొరతకు మంజీరా పరీవాహక ప్రాంతంలో గణనీయమైన ఇన్‌ఫ్లోలు లేకపోవడమే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల నుంచి కూడా ఆశించిన స్థాయిలో నీరు రాలేదని పేర్కొంటున్నారు.2025లో వరదల కారణంగా సుమారు 300 టీఎంసీల నీరు సింగూరుకు జలాశయానికి చేరినప్పటికీ.. ప్రాజెక్టు భద్రతా చర్యల్లో భాగంగా ఎక్కువ మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేశారు.

సుమారు 16 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచారు. అనంతరం పనులు తిరిగి ప్రారంభించే ముందు మరో 8 టీఎంసీలను విడుదల చేశారు. వర్షాలతో అదనంగా సుమారు 4 టీఎంసీల నీరు చేరుతుందని.. తద్వారా వేసవి అవసరాలు తీరుతాయని అధికారులు అంచనా వేశారు. అయితే ఆశించిన స్థాయిలో సింగూరు జలాశయంలో నీటి నిల్వలు పెరగలేదు.హైదరాబాద్‌కు అదనపు గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు మిషన్ భగీరథ, జలమండలి అధికారులు పనులను వేగవంతం చేస్తున్నారు. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఎంబీఆర్)కు గోదావరి నీటిని తరలించే 1600 మిల్లీమీటర్ల మిషన్ భగీరథ–జలమండలి పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి అయ్యాయి. అయితే మిషన్ భగీరథ పరిధిలో కొన్ని పైప్‌లైన్ పనులు, జంక్షన్లు, తుది కనెక్షన్లు ఇంకా పూర్తి కావాల్సి ఉంది

'డ్రోన్స్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



హారర్ వైపు నుంచి .. ఫాంటసీ జోనర్ నుంచి .. ఫిక్షన్ నుంచి ఏదైనా సినిమా వస్తుందంటే చాలు, ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి విపరీతమైన రెస్పాన్స్ కనిపిస్తోంది. అలాంటిది ఈ అంశాలన్నిటినీ కలుపుకుని రూపొందిన ఒక సినిమా ఓటీటీ ట్రాక్ పైకి వచ్చిందంటే ఎలా ఉంటుందనేది ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. అలా రాఘవ్ దర్శకత్వంలో రూపొందిన సినిమానే 'డ్రోన్స్'. అక్టోబర్ 16వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. కన్నడ .. మలయాళ .. హిందీ భాషల్లోను అందుబాటులో ఉంది.నగరంలో 'సైకో' డాన్సర్ వరుస హత్యలు చేస్తూ వెళుతుంటాడు. అతని పట్టుకోవడానికి పోలీస్ ఆఫీసర్ మాధవన్ (సతీశ్) షెర్లాక్ హోమ్స్ (శశి సెల్వరాజ్) రంగంలోకి దిగుతారు. ఇదే సమయంలో కిశోర్ (ద్రావిడ్ సెల్వమ్) .. రష్మిక (అంజలి నాయర్) .. దశ్ (దీపక్) కాలేజ్ ఎగ్గొట్టి సెకండ్ షో సినిమాకి వెళతారు. అక్కడ జరిగిన ఒక సంఘటన కారణంగా, అనుకోకుండా పోలీస్ స్టేషన్ కి వెళ్లవలసి వస్తుంది. ఈ విషయం కాలేజ్ యాజమాన్యం దృష్టికి వెళ్లడంతో 10 రోజుల పాటు వాళ్లను సస్పెండ్ చేస్తారు.ఇంటికి వెళ్లడం ఇష్టం లేని మిత్ర బృందానికి, గతంలో అదే కాలేజ్ లో చదివిన పద్మనాభం (కురైషి) గురించి తెలుస్తుంది. హాస్టల్ వాళ్లకు ఇబ్బంది అయితే ఆదుకునే అలవాటు ఉన్న వ్యక్తి అతను. అతను 'బ్లాక్ హోల్' అనే తన బంగ్లాలో వాళ్లకి ఆశ్రయం కల్పిస్తాడు. అతను ఆ బంగ్లాలో ఏవో ప్రయోగాలు చేస్తుంటాడు. పద్మనాభం బంగ్లాలో ఉన్న కిశోర్ టీమ్ కి బయటి ప్రపంచం గురించి తెలియకుండా పోతుంది. ఆ ఇంట్లో ఏ పని కావాలన్నా 'డ్రోన్' తోనే చెప్పాలి. కెమెరా కలిగిన డ్రోన్ ను బయటికి పంపించిన కిశోర్, ఒక పాడుబడిన బంగ్లాలో ఒక అందమైన అమ్మాయి ఉండటం చూస్తాడు. తొలిచూపులోనే మనసు పారేసుకుంటాడు. ఒక రోజున డ్రోన్ కెమెరాలో ఆ అమ్మాయి కనిపించకపోవడంతో, కిశోర్ నేరుగా ఆ ఇంటికి వెళతాడు. ఆమె పేరు 'ప్రకృతి' అని తెలుసుకుంటాడు. తన మనసులోని మాటను ఆమెకి చెబుతాడు. తాను ఒంటరిగా ఉండటం లేదనీ, తన బామ్మ వచ్చేలోగా పారిపొమ్మని ప్రకృతి అంటుంది. ఆ పాడుబడిన ఇంట్లో ఎన్నో మగ బొమ్మలు వ్రేళ్లాడుతూ ఉంటాయి. ఆ ఇంట్లో ప్రకృతి అనే అందమైన యువతితో పాటు ఆమె బామ్మ అయిన మాంత్రికురాలు ఉంటుంది. తన మనవరాలిని ఎవరూ చూడకుండా .. ప్రేమించకుండా ఆమె అక్కడ రహస్యంగా ఉంచుతోందని కిశోర్ తో పాటు అతని స్నేహితులు భావిస్తారు. ఆ మాంత్రికురాలు ఎవరు? ప్రకృతితో కలిసి ఆమె అక్కడ ఎందుకు ఉంటుంది? పద్మనాభం చేస్తున్న ప్రయోగం ఏమిటి? సైకో డాన్సర్ ఎవరు? అనేది మిగతా కథ.ఒక వైపున సిటీలో వరుస హత్యలకు పాల్పడుతున్న సైకో డాన్సర్ .. మరొక వైపున కాలేజ్ నుంచి సస్పెండ్ చేయబడిన ముగ్గురు స్టూడెంట్స్ .. ఇంకొక వైపున ఒక పాడుబడిన బంగ్లాలో నివసిస్తున్న మాంత్రికురాలు .. ఈ మూడు అంశాలను కలుపుకుంటూ అల్లిన కథ ఇది. సైకో డాన్సర్ ఎవరు? ముగ్గురు స్టూడెంట్స్ కి ఎదురయ్యే అనుభవాలు ఎలాంటివి? పాడుబడిన బంగ్లాలో నివసిస్తున్న మాంత్రికురాలు ఉద్దేశం ఏమిటి? అనేది ఈ కథలో ప్రధానంగా కనిపించే అంశాలు. వీటి చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఈ సినిమా పోస్టర్స్ చూడగానే దర్శకుడు ఈ కంటెంట్ ను కామెడీతో నడిపించాడనే విషయం అర్థమైపోతుంది. సిటీలో సైకో డాన్సర్ వలన హత్యలు జరుగుతున్న తీరు .. ముగ్గురు స్టూడెంట్స్ కి ఎదురయ్యే చిత్రమైన అనుభవాలు .. మాంత్రికురాలు సృష్టించే భయానక వాతావరణం అంతా కూడా కామెడీ టచ్ తోనే నడుస్తూ ఉంటుంది. అయితే ఆశించిన స్థాయిలో కామెడీ పేలకపోవడమే ఇక్కడ కనిపించే ప్రధానమైన సమస్య అని చెప్పాలి. దర్శకుడి వాయిస్ ఓవర్ తో ఈ కథ మొదలవుతుంది. వాయిస్ ఓవర్ వింటున్నప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. పెద్దవాళ్లు తమ మైండ్ సెట్ ను చైల్డ్ మోడ్ లోకి మార్చుకుని ఈ సినిమా చూస్తే వచ్చే కిక్కు వేరని చెబుతారు. కానీ అలాంటి కిక్ మనకి ఎక్కదు .. ఎక్కడా కనిపించదు. మొత్తం కథ నాలుగు గోడల మధ్య .. ఏడు పాత్రల మధ్య నడుస్తుంది.

ఏ పాత్రను కూడా విభిన్నంగా .. విలక్షణంగా మలచినట్టుగా అనిపించదు. సైకో డాన్సర్ ఎవరు .. స్టూడెంట్స్ ఎలా బయటపడతారు? మాంత్రికురాలి ఫ్లాష్ బ్యాక్ ఏమిటి? అనేవి ఆడియన్స్ లో ఉత్కంఠను రేకెత్తించే అంశాలుగా కనిపిస్తాయి. కానీ ఇందుకు సంబంధించిన సన్నివేశాలన్నీ కూడా పేలవంగానే సాగుతాయి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ కూడా ప్రేక్షకులను తట్టి లేపలేకపోతాయి. నటీనటుల నటన .. సాంకేతిక నిపుణుల నైపుణ్యం గురించి పెద్దగా చెప్పుకోవడానికి ఏమీలేదు. సినిమా మొత్తం మీద ఒక డ్రోన్ చూపించి, దానినే టైటిల్ గా సెట్ చేయడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. కామెడీ టచ్ కారణంగా హత్యలకు సంబంధించిన ట్రాక్ గానీ .. మాంత్రికురాలికి సంబంధించిన దృశ్యాలుగానీ నవ్వించలేకపోయాయి. ఇక స్టూడెంట్స్ కి సంబంధించిన కామెడీ సీన్స్ మాత్రం నవ్వించలేకపోగా భయపెడతాయి. కనుక ఈ సినిమా చూడాలంటే ఓపికతో పాటు ధైర్యం కూడా అవసరమే అనే విషయాన్ని గ్రహించవలసి ఉంటుంది.

'పుష్ప 2' రికార్డుకు అడుగు దూరంలో

'రామాయణ'

మరో రూ. 7 కోట్లు వస్తే ఆల్ టైమ్ రికార్డ్!



రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. విడుదలైన 20 రోజుల్లోనే ఈ సినిమా వసూళ్ల పరంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1735.15 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించి, ఆల్ టైమ్ హయ్యస్ట్ గ్రాసింగ్ చిత్రాల జాబితాలో అగ్రస్థానానికి చేరువవుతోంది. ప్రముఖ ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. 'పుష్ప 2' (రూ. 1742 కోట్లు) లైఫ్‌టైమ్ రికార్డును అధిగమించేందుకు రామాయణకి కేవలం మరో రూ. 7 కోట్లు మాత్రమే అవసరం. ఈ సినిమా 20 రోజుల ప్రదర్శన ముగిసేసరికి దేశీయంగా రూ. 972.95 కోట్ల నెట్, రూ. 1162.15 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. విదేశాల్లో ఏకంగా రూ. 573 కోట్ల గ్రాస్ సాధించడం విశేషం. దీంతో భారత్‌లో రూ. 1000 కోట్ల నెట్ వసూళ్ల మైలురాయిని ఈ చిత్రం ఎప్పుడు అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిన్న గురునానక్ జయంతి సందర్భంగా టికెట్ ధరలను కేవలం రూ. 99కి తగ్గించడం సినిమాకు భారీగా కలిసొచ్చింది. ఆ ఒక్కరోజే ఈ చిత్రం దేశవ్యాప్తంగా రూ. 17.50 కోట్లు వసూలు చేసింది. ఇందులో హిందీ వర్షన్ నుంచే రూ. 14.25 కోట్లు రాగా, మలయాళంలో రూ. 1.25 కోట్లు, కన్నడలో రూ. 90 లక్షలు, తమిళంలో రూ. 70 లక్షలు, తెలుగులో రూ. 40 లక్షలు వసూలయ్యాయి.

టికెట్ ధరల తగ్గింపు, సెలవుదినం కారణంగా వసూళ్లు పెరుగుతాయని ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ముందుగానే అంచనా వేశారు. ప్రారంభంలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, మౌత్ టాక్, పండుగల సీజన్ కలిసి రావడంతో సినిమా వసూళ్లు అనూహ్యంగా పెరిగాయి. కేవలం 20 రోజుల్లోనే నాలుగో అతిపెద్ద భారతీయ చిత్రంగా నిలిచింది. 'పుష్ప 2' రికార్డును దాటిన తర్వాత ఈ చిత్రం ముందు 'దంగల్', 'ధురంధర్ 2' వంటి చిత్రాలు మాత్రమే ఉంటాయి. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో యశ్, సన్నీ డియోల్, లారా దత్తా వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు.


రాజమౌళి 'వారణాసి' విడుదల వాయిదా పడనుందా?



భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ముందుగా ప్రకటించిన 2027 ఏప్రిల్ 7వ తేదీ నాటికి ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారీ వీఎఫ్ఎక్స్ (విజువల్ ఎఫెక్ట్స్), గ్రాఫిక్స్ పనుల కోసం దర్శకుడు రాజమౌళికి మరింత సమయం అవసరమని తెలుస్తోంది. కేవలం విడుదల తేదీని అందుకోవడం కోసం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడటానికి జక్కన్న సిద్ధంగా లేరని సమాచారం. వీఎఫ్ఎక్స్ ఫైనల్ ఔట్‌పుట్ చూసిన తర్వాతే రిలీజ్ తేదీపై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు టాక్. అయితే ఈ వాయిదా వార్తలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం అధికారికంగా 2027 ఏప్రిల్ 7వ తేదీనే రిలీజ్ డేట్ గా కొనసాగుతోంది. ఇటీవల నవంబర్ 15న ఎక్స్ వేదికగా చిత్ర యూనిట్ స్పందిస్తూ.. షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం సీజీ వర్క్, రీ-రికార్డింగ్ నడుస్తున్నాయని, త్వరలోనే డబ్బింగ్ పనులు మొదలవుతాయని వెల్లడించింది. మైథాలజీ, టైమ్ ట్రావెల్, యాక్షన్ అంశాలతో ముడిపడిన అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇందులో మహేశ్ బాబు 'రుద్ర'గా, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా, పృథ్వీరాజ్ 'కుంభ'గా కనిపించనున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. పూర్తిగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరించిన తొలి నాన్-ఇంగ్లీష్ చిత్రంగా నిలుస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ విడుదల తేదీపై అభిమానులు స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు.

కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న 'బేబీ' బ్యూటీ..

'హలో ప్రేమ' ట్రైలర్ విడుదల!



'బేబీ' సినిమాతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి వైష్ణవి చైతన్య, ఇప్పుడు కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టింది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఆమె నటించిన తాజా చిత్రం 'హలో కాదల్'. ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల కోసం 'హలో ప్రేమ' పేరుతో విడుదల చేస్తున్నారు. మలయాళ దర్శకుడు నిఖిల్ మురళి ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, మరో కీలక పాత్రలో నిఖిలా విమల్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమైంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్లలో వేగం పెంచింది. ఇందులో భాగంగా తాజాగా 'హలో ప్రేమ' తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌లోని సన్నివేశాలను గమనిస్తే, ఇదొక ఆసక్తికరమైన త్రయాంగిల్ లవ్ స్టోరీగా రూపొందినట్లు స్పష్టమవుతోంది. ఆర్య, వైష్ణవి చైతన్య, నిఖిలా విమల్ మధ్య సాగే ప్రేమ, భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం ఈ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగులో 'బేబీ'తో భారీ విజయాన్ని అందుకున్న వైష్ణవి చైతన్యకు, ఈ డబ్బింగ్ చిత్రం ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.

ఏడవాలని ఉంటుంది, కానీ కన్నీళ్లు రావు..

తనలోని బాధను బయటపెట్టిన నాగ చైతన్య

సాధారణంగా వివాదాలకు, అనవసరమైన ఇంటర్వ్యూలో నాగ చైతన్యకు ఎదురైన ఓ ప్రశ్న ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మీరు ఎప్పుడైనా ఏడ్చారా? అనే ప్రశ్నకు ఆయన ఎంతో నిజాయితీగా సమాధానమిచ్చారు. తనకు కొన్ని సందర్భాల్లో బాగా ఏడవాలని అనిపిస్తుందని, కానీ బయటకు కన్నీళ్లు రావని వెల్లడించారు. బాధ కలిగినప్పుడు ఆ భావాలను ఇతరులకు చూపించడం తనకు అంత సులభం కాదని, చాలా సందర్భాల్లో లోలోపలే బాధపడుతుంటానని చెప్పారు. ఎప్పుడూ కూల్‌గా, చిరునవ్వుతో కనిపించే నాగ చైతన్యలో ఇంతటి భావోద్వేగ కోణం ఉందా అంటూ అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక తనపై సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, విమర్శలు, ట్రోలింగ్ గురించి కూడా నాగ చైతన్య ఆసక్తికరంగా స్పందించారు. తన గురించి ఎలాంటి వార్తలు వచ్చినా వెంటనే స్పందించకపోవడాన్ని చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి విషయానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్నెట్‌లో ఏ వార్తా శాశ్వతంగా ఉండదని, ఈరోజు ఒక విషయం ట్రెండ్ అయితే రేపు దాని స్థానంలో మరో కొత్త విషయం వచ్చేస్తుందని చైతన్య పేర్కొన్నారు. అందుకే నెగటివిటీని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ ముందుకు వెళ్లడమే మంచిదని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన మాటల్లో కనిపించిన పరిణతి, ప్రశాంతత అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

'మిస్ యూనివర్స్' విజేతగా ప్యూర్టోరికో సుందరి జెన్నిఫర్ బారెటో..

తల్లిగా కిరీటం గెలుచుకుని చరిత్ర



జెన్నిఫర్ బారెటో నిలిచారు. ప్యూర్టోరికోలోని శాన్ జువాన్ నగరంలో గల హోసే మిగ్యుల్ అగ్రెలోట్ కొలీజియంలో జరిగిన 75వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేలో ఆమెను విశ్వసుందరి కిరీటం వరించింది. గత విజేత, మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ ఆమెకు కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీల్లో డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా న్యూనెజ్ ఫస్ట్ రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా గోట్జ్ సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. 27 ఏళ్ల జెన్నిఫర్ బారెటో వృత్తిరీత్యా సైకాలజిస్ట్, సోషల్ వర్కర్. గతంలో యూఎస్ ఆర్మీతో కలిసి కూడా పనిచేశారు. మిస్ యూనివర్స్ సంస్థ నిబంధనలను సవరించిన తర్వాత, ఒక బిడ్డకు తల్లిగా ఉండి ఈ కిరీటాన్ని గెలుచుకున్న మొట్టమొదటి మహిళగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా, ప్యూర్టోరికో నుంచి ఈ టైటిల్ సాధించిన ఆరో మహిళగా ఆమె రికార్డుకెక్కారు. 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈసారి విజేతకు 3,150 వజ్రాలు, వైట్ గోల్డ్‌తో రూపొందించిన ప్రత్యేక కిరీటాన్ని అందించారు. ఈ మహా వేదికపై మొత్తం 116 దేశాల సుందరీమణులు పోటీపడ్డారు. మరోవైపు, భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో టాప్ 12లోకి ప్రవేశించలేకపోయారు. ఈవెనింగ్ గౌన్ రౌండ్‌కు ముందే ఆమె పోటీ నుంచి నిష్క్రమించడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది. బెంగళూరులో లా చదువుతున్న కజియా, కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా కిరీటం దక్కించుకున్న తొలి యువతిగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. మిస్ యూనివర్స్ టైటిల్ గెలుచుకున్న జెన్నిఫర్ బారెటో త్వరలోనే పలు అంతర్జాతీయ సేవా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం.

మంథని పట్టణంలో పేదోడికి పండుగ రోజు.
గృహప్రవేశంతో సాకారమైన సొంతింటి కల!
కాంగ్రెస్ పాలనలో పేదవాడి జీవితంలో.
వెలుగులు ఇందిరమ్మ ఇండ్లతో కొత్త ఆశలు



మంథని(ప్రశ్న న్యూస్)మంథని మున్సిపల్ పరిధిలో బుధవారం రోజున పేద కుటుంబానికి సొంత ఇంటి కల సాకారమైంది. మంథని పట్టణానికి చెందిన పేద కుటుంబ సభ్యులకు తమ సొంత ఇంటి నిర్మాణానికి ఘనంగా మంత్రి గృహప్రవేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ప్రత్యేక చొరవతో ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలని. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నిజం చేయాలనే సంకల్పంతో వారు నిరంతరం కృషి చేస్తున్నారు. శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలు పేదల గడప దాకా చేరాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో మంథని టౌన్లో పేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించడం గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.


" కాంగ్రెస్ ప్రభుత్వ దయతో మా కల నిజమైంది. ఈ సహాయానికి మేము జీవితాంతం రుణపడి ఉంటాం" అని లబ్ధిదారులు భావోద్వేగంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.పేదవాడి పక్షాన కాంగ్రెస్ ప్రతి ఇంటికి ఆశ, ప్రతి జీవితానికి భరోసా! ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలనదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

ఇసుకాసురులపై సీఎం కొరడా

- పెన్నా నదిలో అక్రమ తవ్వకాలపై చంద్రబాబు సీరియస్
- తాగునీటి పైప్‌లైన్ ధ్వంసంపై ఆగ్రహం
- బాధ్యులపై కేసులు.. ట్రాక్టర్లు, యజమానులపై చర్యలు
- అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు



అమరావతి (ప్రశ్న న్యూస్) పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు.. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం ప్రభుత్వ ఆస్తులను సైతం లెక్కచేయకుండా సాగుతున్న అక్రమ ఇసుక దందాపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన సీఎం.. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడినా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా ఎవరినీ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు.కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లి వద్ద పెన్నానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించడంతో తవ్వకాలు, ఇసుక రవాణాను నిలిపివేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్లు, వాటి యజమానులు, ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



పైప్‌లైన్ ధ్వంసంపై కఠిన చర్యలు..

ఇసుక తవ్వకాల క్రమంలో ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్ ధ్వంసం కావడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన బాధ్యులు, ట్రాక్టర్ యజమానులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ సీఎంవోకు నివేదించారు. దెబ్బతిన్న పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

నదీ తీరాల్లో ప్రత్యేక నిఘా..

ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పెన్నా, చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల ద్వారా నిరంతర తనిఖీలు నిర్వహించడంతో పాటు పెన్నానది వెంబడి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వంటి ఉల్లంఘనలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా కలెక్టర్‌కు స్పష్టం చేసింది. అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఎంతవరకు నిఘా పెట్టారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజల తాగునీటి అవసరాలను సైతం ప్రమాదంలోకి నెట్టే అక్రమార్కులపై చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనసాగాల్సిన అవసరం ఉంది.

కిరాయికి కిస్తే ఖేల్ ఖతం, లైసెన్స్ ల పై అధికారుల ఫోకస్

- గుడిమల్కాపూర్ మార్కెట్ లో కిరాయికి కిస్తే షాపు సీజ్ చేసిన జాయింట్ అడిషనల్ డెరైక్టర్ పద్మ హర్ష
- రాష్ట్రంలో "173"మార్కెట్ లో జల్లెడ పడుతున్న మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు
- ఐదు తరాల నుంచి కూరగాయల వ్యాపారం, వారసులకు ఓనమాలు తెలియకపోవడంతో విక్రయాలు లేక కిరాయికి సిద్ధం అవుతున్న ఓనర్లు
- లక్షలు పోసి కొనుగోలు చేసి, కోట్లల్లో పద్దులు రాక పరిషాన్ తో కిరాయి దారులు.దీనికి తోడు మార్కెట్ అధికారులు వేధింపులు.?
- గతంలో జాయింట్ అడిషనల్ డైరెక్టర్, అడిషనల్ డెరైక్టర్ గా విధులు నిర్వహించి, పలు మార్కెట్ లో కుప్పలు తెప్పలుగా లైసెన్స్ లు జారీ చేసిన అధికారి" శ్రీ" "మంతుడు". ప్రస్తుతం ఈయన విశ్రాంతి ఉద్యోగి
- ఓకే వ్యక్తి కుటుంబానికి "3"మార్కెట్ లో సుమారు "16"లైసెన్స్ లు జారీ చేసిన ప్రబుద్ధుడు శ్రీనివాసుడు
- వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో ఉన్నత అధికారులు"చీడ పురుగులు"గా మారి చెదలు పట్టిస్తున్నారు
- అన్నదాతలను అధికారులు, వర్తకులు కలిసి "కాలనాగు"లా కాటేస్తున్నారు
- సాక్షాత్తు శాసనసభ సాక్షిగా నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ గుడిమల్కాపూర్

మార్కెట్ పై జరుగుతున్న అవినీతిని ఎండగడుతూ, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తు చూపాడు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వ్యవసాయ మార్కెట్ లల్లో జరుగుతున్న పరిణామాల పై మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం విదితమే!రాష్ట్రంలో ఉన్న "173"మార్కెట్ ల్లో చోటు చేసుకుంటున్న అవినీతి ఆరోపణలు పై ఫోకస్ చేస్తున్న అధికారులు.ఈ నేపథ్యంలో గత కొన్ని రోజుల క్రితం గుడి మల్కపూర్ మార్కెట్ లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు కేటాయించిన

షాపులో యాజమాని వ్యాపారం చేయకుండా ఇతరులకు కిరాయి ఇవ్వడంతో "స్పెషల్ డ్రైవ్" లో భాగంగా జాయింట్ అడిషనల్ డైరెక్టర్ పద్మ హర్ష రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.అద్దెకు ఉన్న వ్యక్తిని ఆర తీస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.వాస్తవం ఏమిటంటే గుడిమల్కపూర్‌మార్కెట్ యార్డులో షాపు నెంబర్: 44.లోకేటాయించిన లైసెన్స్ దారులు"జెక్కిడి నారాయణ రెడ్డి"ఆయన స్థానంలో మరో వ్యక్తి కిరాయి తీసుకుని కూరగాయల వ్యాపారం చేస్తున్నాడున్న సమాచారంతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తే బట్టబయలు అయిన నిజాలు. ఈ విషయాన్ని గమనించిన జాయింట్ అడిషనల్ డైరెక్టర్ పద్మ హర్ష యుద్ధప్రాతిపదికన సదరు కిరాయి పై సోదాలు నిర్వహించగా అతను "జెక్కిడి నారాయణ రెడ్డి"వద్ద కిరాయికిడ తీసుకున్నట్లు వాంగ్మూలం ఇవ్వడంతో ఆ షాపు లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు అధికారి పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం.ఇలా గుడిమల్కపూరం మార్కెట్ ని జల్లెడ పడుతున్నారు స్పెషల్ డ్రైవ్ అధికారులు.

ప్రజా వేదిక పై ఎమ్మెల్యే ఆవేదన,జల్లెడ పడుతున్న మార్కెట్ అధికారులు:

అసెంబ్లీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ గుడిమల్కాపూర్ కూరగాయలు, పూల మార్కెట్ దుస్థితి పై గళమెత్తారు. ఎన్నో సదుపాయాలతో ప్రారంభమైన ఈ చారిత్రాత్మక మార్కెట్ నేడు కనీస సౌకర్యాలకు నోచుకోక దయనీయ స్థితిలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.రాత్రి వేళల్లో తమ పంటను అమ్ముకోవడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే రైతులు విశ్రాంతి తీసుకోవడానికి కనీసం విశ్రాంతి భవనం కూడా లేదని,దీనివల్ల వారు తమ వాహనాలపైనే లేదా కూరగాయల బస్తాల పక్కనే పడుకోవాల్సి వస్తోందని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు.రైతుల ఆకలి తీర్చేందుకు మార్కెట్‌లో కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా లేదని,ప్రభుత్వం వెంటనే స్పందించి రెస్ట్ రూమ్,క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లి,కార్వాన్, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నిత్యం ఇక్కడికి వచ్చి కొనుగోళ్లు జరుపుతారని,అయినప్పటికీ మార్కెట్‌లో కనీస మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.చెత్తను నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే ఎత్తడం వల్ల మార్కెట్ అంతా దుర్గంధంతో నిండిపోయిందని,అలాంటి అపరిశుభ్ర వాతావరణంలో రైతులను ఉంచడం మన బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. మార్కెటింగ్ కమిటీలు తమ బాధ్యతను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.తాను చిన్నప్పటి నుండి తన తండ్రి చేయి పట్టుకుని ఈ మార్కెట్‌కువచ్చేవాడినని, కానీ ఈరోజు కనీసం నడవడానికి కూడా స్థలం లేకుండా పోయిందని అన్నారు.స్థలం లేకపోయినా కొత్తగా వచ్చే కమిటీలు ఇష్టానుసారంగా"వందలాది కొత్త లైసెన్సులు"జారీ చేస్తున్నాయని, ఇటీవల కూడా ఎటువంటి వసతులు లేకుండానే"75 కొత్త లైసెన్సులు"ఇచ్చారని ఆరోపించారు.కూర్చోవడానికి స్థలం లేకుండా లైసెన్సులు ఇవ్వడం వల్ల వ్యాపారుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయని, స్థల లభ్యత ఆధారంగా మాత్రమే లైసెన్సులు ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా ప్రస్తుత మార్కెట్ కమిటీ



నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. నిబంధనల ప్రకారం కమిటీలో ముగ్గురు రైతులు, ఒక మహిళా సభ్యురాలు ఉండాల్సి ఉన్నప్పటికీ, వారికి స్థానం కల్పించలేదని ఆరోపించారు. ఖానాపూర, షాబాద్ వంటి ప్రాంతాల్లో నివసించే వ్యక్తులు షేక్‌పేట్, కార్వాన్ స్థానిక ధృవీకరణ పత్రాలతో పాటు వెటర్నరీ విభాగం నుండి లైవ్ స్టాక్ సర్టిఫికెట్లు తెచ్చుకుని ఏకంగా చైర్మన్,వైస్ చైర్మన్, సభ్యులుగా చలామణి అవుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. స్థానిక ప్రజల హక్కులను కాలరాస్తూ జరుగుతున్న ఈ అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న వారికే కమిటీలో అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దినికి నిదర్శనమే
"స్పెషల్ డ్రైవ్"కార్యక్రమాన్ని
తెర మీదకు తీసుకువచ్చిన
సిఎం రేవంత్ సర్కార్.

"హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్"

పాదయాత్రకు విశేష స్పందన

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నేతృత్వంలో అంబర్‌పేట నుండి ప్రారంభమైన మూడు రోజుల అవగాహన యాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన ప్రముఖ సినీ నటుడు దగ్గుబాటి వెంకటేష్
- వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, యువత, మహిళలు
- ప్రధాని మోదీ సంకల్పాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని నేతల పిలుపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యువత భవిష్యత్తును మాదకద్రవ్యాల బారి నుండి కాపాడి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలనే ఉన్నత ఆశయంతో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారి నేతృత్వంలో "హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్" మూడు రోజుల అవగాహన పాదయాత్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది.

అంబర్‌పేటలోని ఎంసీహెచ్ గ్రౌండ్ వద్ద ప్రముఖ సినీ నటుడు శ్రీ దగ్గుబాటి వెంకటేష్ గారు జెండా ఊపి ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ తదితర ప్రముఖులతో పాటు వేలాది మంది యువత, విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ సంఘీభావం ప్రకటించారు.

ప్రజా ఉద్యమంగా మారాలి..

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు 'నషా ముక్త్ భారత్' సంకల్పాన్ని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన



బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, మొత్తం కుటుంబాన్ని మరియు దేశ భవిష్యత్తును నాశనం చేస్తాయని వారు హెచ్చరించారు.

యువత తమ శక్తిని క్రీడలు, విద్య మరియు సృజనాత్మక రంగాల వైపు మళ్లించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

పాదయాత్ర సాగే మార్గం..

అంబర్‌పేట నుండి ప్రారంభమైన ఈ అవగాహన యాత్ర ఉస్మానియా యూనివర్సిటీ, ఇఫ్లూ , గాంధీ హాస్పిటల్ మీదుగా సాగుతూ విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించింది. మూడు రోజుల పాటు సుమారు 30 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర నవంబర్ 27న జూబ్లీహిల్స్‌లో ముగియనుంది.

ప్రజల భూములు అమ్మకానికి కాదు.. ప్రజల హక్కు

- ప్రభుత్వ భూముల విక్రయ నిర్ణయాన్ని అడ్డుకుంటాం
- ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యం
- బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్

శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేర్లింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ భూములను విక్రయించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకత్వంలో హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా పొట్ట నరేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని విక్రయించే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. ప్రజా ఆస్తులను అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటం, ప్రజల ఆస్తులను ప్రజలకే దక్కేలా చూడటం తమ బాధ్యతని పేర్కొన్నారు. భూముల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.







ఏసీబీలోనే అవినీతి బాగోతం

బయటకు రాని బాధితులు ఎంతమందో.?

- కేసు నీరుగార్చేందుకు రూ.30 లక్షల డీల్

- జైల్లో ఉన్నప్పుడే మొదలైన లంచాల స్కెచ్
- రూ.15 లక్షలకు బినామీ అధికారికి విముక్తి.?
- ఫార్మసీ దుకాణం వద్ద కుదిరిన లంచం ఒప్పందం
- ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు.? సస్పెండ్ ఉండదా.?
- ఇతర ప్రభుత్వ ఉద్యోగులు దొరికితే జైలు శిక్ష..

మరి ఈ ఏసీబీ అధికారికి ఏ శిక్ష?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అవినీతిని అంతమొందించాల్సిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లోనే లంచాల బాగోతం వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. అక్రమార్కుల భరతం పట్టాల్సిన ఓ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడితోనే బేరసారాలకు దిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ.30 లక్షలు ఇస్తే కేసును నీరుగార్చి, నిందితుడికి అనుకూలంగా మార్చడంతోపాటు మరో అధికారిని కేసు నుంచి తప్పిస్తానంటూ ప్రతిపాదించినట్లు సమాచారం. అంతేకాకుండా, దర్యాప్తు అధికారి తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఫిర్యాదు చేయాలని నిందితుడికి సూచించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై బాధితుడు నేరుగా ఏసీబీ ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సంబంధిత ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేసి, అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ పరిణామం ఏసీబీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దానితోపాటు ఏసీబీ అంటేనే ప్రజలలో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

- కాంట్రాక్టర్ ద్వారాములాఖత్.. అక్కడి నుంచే డీల్

హైదరాబాద్ శివార్లలోని విద్యుత్ పంపిణీ సంస్థలో పనిచేస్తున్న ఓ అధికారిపై ఏడాది క్రితం ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్టయిన అధికారి జైలులో ఉన్న సమయంలోనే లంచాల బేరసారాలకు తెరలేచినట్లు తెలుస్తోంది. గతేడాది సెప్టెంబరులో ఓ కాంట్రాక్టర్ ములాఖత్ ద్వారా నిందితుడిని కలిశాడు. కేసును పర్యవేక్షిస్తున్న ఏసీబీ అధికారి తనకు బాగా పరిచయమని, డబ్బులు ఇస్తే కేసు మూసివేయించేలా చూస్తానని నమ్మబలికాడు. బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా సదరు కాంట్రాక్టర్ నిందితుడికి ఫోన్ చేసి ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఈ క్రమంలో గతేడాది డిసెంబరులో బెయిల్ షరతులకు సంబంధించి ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను దర్యాప్తు అధికారి తనకు అనుకూలంగా మలుచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులో బినామీగా మరో సమాన హోదా కలిగిన అధికారిని చేర్చిన అంశాన్ని ప్రస్తావిస్తూ నిందితుడితో బేరసారాలకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

-బినామీ పేరు తొలగించేందుకు రూ.15 లక్షలు

నిందితుడిని అరెస్టు చేసిన సమయంలో అతడికి బినామీగా అదే హోదాలో పనిచేస్తున్న మరో అధికారిని కూడా కేసులో నిందితుడిగా చేర్చినట్లు



సమాచారం. అయితే ఉన్నతాధికారుల సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. సరైన ఆధారాలు లేకుండా సమాన హోదాలో ఉన్న అధికారిని బినామీగా చూపడంపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో, అతడి పేరును కేసు నుంచి తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ అంతర్గత పరిణామాన్ని ఆసరాగా చేసుకున్న దర్యాప్తు అధికారి నిందితుడిని మభ్యపెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. బినామీగా చేర్చిన అధికారి పేరును తొలగించేందుకు రూ.15 లక్షలు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నీరుగార్చేందుకు మరో రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు నిందితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మొత్తం రూ.30 లక్షల మేర డీల్ కుదిరినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- రూ.5 లక్షలు అందుకున్నట్లు ఫిర్యాదు

ఈ బేరసారాలు పలుమార్లు కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మే 2వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ డీఈ నిందితుడికి ఫోన్ చేసి దర్యాప్తు అధికారి కలవాలని చెప్పినట్లు సమాచారం. దీంతో నిందితుడితో పాటు బినామీగా కేసులో నమోదైన మరో అధికారి కలిసి దర్యాప్తు అధికారి ఇంటికి సమీపంలోని ఓ ఫార్మసీ దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడికి వచ్చిన దర్యాప్తు అధికారి వారితో చర్చలు జరిపినట్లు నిందితుడు ఫిర్యాదులో వివరించారు. బినామీ అధికారిని కేసు నుంచి తప్పించేందుకు రూ.15 లక్షలు



చెల్లించేందుకు అంగీకారం కుదరగా, అదే రోజు రూ.5 లక్షలు అందజేసినట్లు పేర్కొన్నట్లు తెలిసింది. అనంతరం మే 7న డీఈ మరోసారి ఫోన్ చేయడంతో నిందితుడు దర్యాప్తు అధికారిని కలిశాడు. ఆ సమయంలో కారులోనే తిరుగుతూ బినామీ అధికారి పేరును తొలగించేందుకు ఫైల్ సిద్ధం చేస్తున్నామని, మిగిలిన డబ్బులు సమకూర్చుకోవాలని దర్యాప్తు అధికారి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే 14న కూడా సంబంధిత డీఈ ఫోన్ చేసి డబ్బుల విషయాన్ని ప్రస్తావించినట్లు నిందితుడు ఆరోపించారు.

- ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు.. లోతుగా విచారణ

తనను కేసు నుంచి తప్పిస్తానంటూ లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ బాధితుడు నేరుగా ఏసీబీ ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సంబంధిత ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేసి, అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై అత్యంత గోప్యంగా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ లంచాల డీల్‌లో కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ డీఈల పాత్ర ఎంతవరకు ఉంది.? వారు కేవలం మధ్యవర్తులుగానే వ్యవహరించారా.? లేక మరికొందరు అధికారులు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.? అనే కోణంలోనూ విచారణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆరోపణలు రుజువైతే సంబంధిత ఇన్‌స్పెక్టర్‌తో పాటు వ్యవహారంలో భాగస్వాములైన వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అవినీతిపరులపై చర్యలు తీసుకోవాల్సిన సంస్థలోనే ఇలాంటి అవినీతి ఆరోపణలు రావడం ఏసీబీ ప్రతిష్టకు సవాలుగా మారింది.

గోదావరి కాలుష్యం.. పట్టించుకోని ప్రభుత్వం

- ఆదివాసీల జీవనాధారాన్ని, అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఐటీసీ పేపర్ బోర్డు పరిశ్రమపై సమగ్ర విచారణ జరిపి, కాలుష్యం నిర్ధారణ అయితే సంస్థ కార్యకలాపాలు నిలిపి వేయాలి
- త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్





భద్రాచలం(ప్రశ్న న్యూస్)భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న పవిత్ర గోదావరి నది పారిశ్రామిక కాలుష్య కోరల్లో చిక్కుకుంటుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, గోదావరి నదిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ, గిరిజన ప్రజల ఆరోగ్యం, జీవనాధారం, అస్తిత్వం ప్రమాదంలో పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.భద్రాచలంలోని ఐటీసీ పేపర్ బోర్డు పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు గోదావరిలో కలుస్తుండడంతో ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. నదిలో నీటి రంగు, వాసన, నాణ్యతలో మార్పులు కనిపిస్తున్నాయంటూ పలువురు వ్యక్తం చేస్తున్న చేయడాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. వ్యర్థ జలాల కారణంగా చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయన్న ఫిర్యాదులపై నిపుణుల బృందంతో శాస్త్రీయ విచారణ జరిపించాలని కోరారు.గోదావరి నది ఆదివాసీ గిరిజనులకు కేవలం నీటి వనరు మాత్రమే కాదని, అది మా జీవన విధానంలో భాగమని పూనెం ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. తాగునీరు, వ్యవసాయం, పశుపోషణ, చేపల వేట వంటి జీవనోపాధులు గోదావరిపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. నది కాలుష్యానికి గురైతే దాని ప్రభావం ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా వేలాది కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, సంప్రదాయ జీవన విధానంపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల జీవనాధారమైన ప్రకృతి వనరులను కాపాడటం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని గుర్తుచేశారు.

- జల కాలుష్యంతో పాటు వాయు కాలుష్యంపైనా విచారణ జరపాలి

పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలతో పాటు పొగ, వాయు రసాయనాలపై కూడా సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థ జలాలను ఎక్కడ, ఏ విధంగా శుద్ధి చేస్తున్నారు? శుద్ధి చేసిన నీరు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? గోదావరిలో పరిశ్రమకు ఎగువన, దిగువన నీటి నాణ్యతలో తేడాలు ఉన్నాయా? పరిశ్రమ నుంచి వెలువడే వాయు ఉద్గారాలు ప్రజారోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి? అనే అంశాలపై స్వతంత్ర నిపుణుల బృందంతో పరిశీలన జరిపించాలని కోరారు.

గతంలోనూ ఈ పరిశ్రమకు సంబంధించిన కాలుష్య సమస్యలపై వార్తలు, ప్రజల ఆందోళనలు వెలువడినప్పటికీ సమస్య పరిష్కారమైందనే నమ్మకం ప్రజల్లో కలగడం లేదన్నారు. పరిశ్రమల అభివృద్ధి పేరుతో ఆదివాసీ ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణం బలికాకూడదని స్పష్టం చేశారు.

- కాలుష్యం నిర్ధారణ అయితే సంస్థ కార్యకలాపాలు నిలిపివేయాలి

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర కాలుష్య



నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ఐటీసీ పరిశ్రమపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు, వాయు రసాయనాల నమూనాలను సేకరించి గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రయోగశాలల్లో పరీక్షించాలని, ఆ నివేదికలను ప్రజలకు బహిర్గతం చేయాలని కోరారు.కాలుష్య నియంత్రణ నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే కేవలం నోటీసులు, జరిమానాలతో సరిపెట్టకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఐటీసీ పరిశ్రమ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి మూసివేతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాల తాగునీటి నమూనాలను పరీక్షించి, ప్రజారోగ్యంపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని సూచించారు.

- ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం న్యాయపోరాటం

గోదావరి నది కాలుష్యంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆదివాసీ ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పూనెం ప్రదీప్ కుమార్ ప్రకటించారు. అవసరమైన ఆధారాలు, కాలుష్య పరీక్షల నివేదికలు, ప్రజల ఫిర్యాదులను సేకరించి చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.గోదావరి నది ఆదివాసీల జీవనాడి అని, దానిని కలుషితం చేసే ఏ చర్యనూ సహించబోమని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఉండాలి, అభివృద్ధి జరగాలి. అయితే ఆ అభివృద్ధి ప్రజల ఆరోగ్యాన్ని, ప్రకృతి సంపదను, ఆదివాసీల అస్తిత్వాన్ని నాశనం చేసే విధంగా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. గోదావరిని కాపాడటం అంటే ఆదివాసీల బతుకులను, భవిష్యత్తును కాపాడటమేనని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ట్రంప్ సర్కారు కొత్త వడ్డింపులు

- భారత్ పై 17 శాతం అదనపు టారిఫ్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది. అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు.మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో డంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి. అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ సుంకాలు అమల్లోకి రావచ్చని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.గతంలో ట్రంప్ ప్రభుత్వం విధించిన గ్లోబల్ టారిఫ్‌లను చెల్లవంటూ, అధ్యక్షుడికి ఆ విధమైన చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని నెలలకే ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఆటోమొబైల్స్, స్టీల్ వంటి నిర్దిష్ట రంగాలపై మాత్రమే ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి.

మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పీఎస్

- సమస్య నోటితో చెబితే ఫిర్యాదు కాపీ రెడీ!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టెక్నాలజీ సాయంతో పోలీస్ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే దిశగా తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను 'మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్'గా ఎంపిక చేసింది. ఈ పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థల పనితీరును రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయన వెంట అడిషనల్ డీజీపీ అకున్ సబర్వాల్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ ఉన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పోలీస్ సేవల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా తొలిసారిగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఐ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇకపై బాధితులు పోలీస్ అధికారుల కోసం గంటల తరబడి స్టేషన్‌లో ఎదురుచూడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఫిర్యాదుదారులు ఏఐ యంత్రం ముందు నిలబడి తమ సమస్యను నోటితో వివరిస్తే చాలని, ఆ యంత్రమే బాధితులు చెప్పిన వివరాలతో ఫిర్యాదు కాపీని స్వయంగా రూపొందిస్తుందని వివరించారు. ఆ తర్వాత ఆటోమేటిక్‌గా సంబంధిత పోలీస్ అధికారులకు ఆ ఫిర్యాదు చేరుతుందని డీజీపీ తెలిపారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా ప్రజలకు పోలీస్ సేవలను సత్వరమే చేరవేయవచ్చని, బాధితుల నుంచి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ సరికొత్త విధానం ఎంతగానో దోహదపడుతుందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ఏఐ కంట్రోల్ తప్పితే ఆపడం ఎవరి వల్లా కాదు

- ఓపెన్‌ఏఐ హెలెన్ టోనర్ సంచలన వార్నింగ్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను విధ్వంసకర శక్తుల చేతుల్లోకి వెళ్లినా లేదా నియంత్రణ కోల్పోయినా దాన్ని ఆపడానికి ఎలాంటి 'కిల్ స్విచ్' (ఎమర్జెన్సీ షట్‌డౌన్) పనిచేయదని ఓపెన్‌ఏఐ మాజీ బోర్డు సభ్యురాలు హెలెన్ టోనర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన భద్రతా నిపుణురాలైన ఆమె ఏఐ ముప్పు తీవ్రతను వివరించారు. ఒక్క కిల్ స్విచ్‌తో అన్ని సమస్యలనూ పరిష్కరించడం అసాధ్యమని టోనర్ స్పష్టం చేశారు. కొన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో వేర్వేరు స్థాయుల్లో షట్‌డౌన్ లేదా ఓవర్‌రైడ్ వ్యవస్థలు ఉపయోగపడతాయేమో కానీ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన వ్యవస్థలను పూర్తిగా ఆపలేవని తెలిపారు. అమెరికా పరిధికి ఆవల, పూర్తి స్వయంప్రతిపత్తితో నడిచే కంప్యూటింగ్ వ్యవస్థలపై పనిచేసే ఏఐలను నియంత్రించడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు. చైనా పోటీని బూచిగా చూపిస్తూ అత్యంత ప్రమాదకరమైన ఏఐ టెక్నాలజీని గుడ్డిగా అభివృద్ధి చేసుకుంటూ పోవడం ఆత్మహత్యాసదృశ్యమని అభిప్రాయపడ్డారు. మరోవైపు 'ఏఐ గాడ్‌ఫాదర్'గా పేరొందిన జెఫ్రీ హింటన్ సైతం ఏఐ ముప్పుపై తీవ్ర హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ లేదా ఆర్థిక వ్యవస్థలను స్తంభింపజేసేలా ఏఐ వల్ల 'చెర్నోబిల్' తరహా పెను విపత్తు సంభవించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఏడాది లేదా రెండేళ్లలోనే ఇలాంటి దుర్ఘటన జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి తీవ్రమైన రిస్కులు ఉంటాయని తెలిసినప్పటికీ ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, శామ్ ఆల్ట్‌మన్ వంటి దిగ్గజాలు లాభాల కోసం పోటీపడుతున్నారని హింటన్ విమర్శించారు. ఏఐ చాట్‌బాట్లు సొంత భాషను అభివృద్ధి చేసుకుంటే నియంత్రణ పూర్తిగా చేజారిపోతుందని తేల్చిచెప్పారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588